## ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం



PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 46, పేజీలు - 08








మంగళవారం, ఆగష్టు 11, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# తెలంగాణ బీజేపీ.. ఇక కాంగ్రెస్సే టార్గెట్

**- తెలంగాణలో పోరు కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ మాత్రమే**

**- రోడ్ మ్యాప్ రెడీ చేసిన హైకమాండ్ - ఇక కమలం దూకుడేనా.?**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఢిల్లీలో జరిగిన కీలక భేటీలో తెలంగాణ బీజేపీ నేతలకు పార్టీ అధిష్ఠానం అత్యంత స్పష్టమైన, పదునైన దిశానిర్దేశం చేసింది. బీజేపీ తెలంగాణ వ్యవహారాల పర్యవేక్షకులు, సీనియర్ నేతల సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో రాబోయే రోజుల్లో రాష్ట్రంలో పాటించాల్సిన రాజకీయ వ్యూహంపై కేంద్ర నాయకత్వం దిశానిర్దేశం చేసింది. ప్రధానంగా బిఆర్ఎస్ ఖాళీ చేసిన ప్రతిపక్ష స్థానాన్ని బీజేపీ సంపూర్ణంగా ఆక్రమించాలని, రాష్ట్రంలో ఇకపై ఏ రాజకీయ పోరాటమైనా కేవలం కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ అనే రీతిలోనే సాగాలని అత్యున్నత స్థాయి సందేశమిచ్చారు.

### బిఆర్ఎస్ స్థానాన్ని గుప్పిట్లోకి తీసుకోవడమే లక్ష్యం

తెలంగాణలో పదేళ్ల పాటు అధికారంలో ఉండి, విపక్షంలోకి వెళ్లాక బిఆర్ఎస్ ఎదుర్కొంటున్న సవాళ్లను అనుకూలంగా మార్చుకోవాలని అధిష్ఠానం భావిస్తోంది. ప్రతిపక్ష పాత్ర పోషించడంలో బిఆర్ఎస్ ఎక్కడైతే వెనకబడుతుందో లేదా విఫలమవుతోందో, ఆ ఖాళీని బీజేపీ తక్షణమే భర్తీ చేయాలని నిర్ణయించింది. ప్రజాపోరాటాల్లో బిఆర్ఎస్‌కు ఎలాంటి రాజకీయ మైలేజ్ దక్కకుండా చూస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించే ఏకైక, నిజమైన ప్రతిపక్ష శక్తి కమల దళమేననే భావనను పబ్లిక్ డొమైన్‌లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించింది.

### గ్యారెంటీలు, హామీల నెరవేర్పడంపై నేరుగా కాంగ్రెస్‌పై దాడి

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా.. ఆరు గ్యారెంటీలు, రైతు రుణాలు, నిరుద్యోగ భృతి, మహిళా పథకాల అమలులో క్షేత్రస్థాయిలో వస్తున్న అసంతృప్తిని ఆయుధంగా మలుచుకోవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఇచ్చే హామీల గ్యారెంటీ ఉత్తుత్తిదే అని, ప్రధాని నరేంద్ర మోదీ మార్క్ సంక్షేమ పథకాలే శాశ్వతమని ప్రజల్లోకి తీసుకెళ్లాలని స్పష్టం చేశారు. విద్యార్థులు, రైతులు, చేతివృత్తుల వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం

2లో..

# జార్ఖండ్ విద్యార్థుల రణభేరి!

**- సీజీఎల్ రద్దు కోరుతూ అసెంబ్లీ ముట్టడి!**



**రాంచీ (ప్రశ్న న్యూస్)** జార్ఖండ్ రాజధాని రాంచీ వీధులు విద్యార్థుల నినాదాలతో హోరెత్తాయి. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన నియామక పరీక్షల్లో, ముఖ్యంగా జేఎస్ఎస్‌సీ సీజీఎల్ పరీక్షలో జరిగిన అక్రమాలకు వ్యతిరేకంగా విద్యార్థి సంఘాలు అసెంబ్లీ మార్చ్‌కు పిలుపునిచ్చాయి. గడిచిన రెండు వాలుగా శాంతియుతంగా సాగుతున్న ఈ నిరసన సోమవారం ఉద్రిక్తంగా మారింది. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం విద్యార్థులు సోమవారం ఉదయం 9 గంటల నుంచి రాంచీలోని పాత అసెంబ్లీ గేటు వద్దు చేరుకోవడం ప్రారంభించారు. పాత అసెంబ్లీ నుంచి కొత్త అసెంబ్లీ భవనం వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల మేర పాదయాత్ర చేపట్టారు. తాము

2లో..

# వర్షాల కోసం వరుణ యాగం

**- సతీసమేతంగా పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి**

- తెలంగాణలో వర్షాల కోసం ప్రభుత్వం మహా వరుణ యాగం
- నాగార్జున సాగర్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతుల పూజలు
- ఎల్ నినో ప్రభావం, తగ్గిన జలమట్టాల నేపథ్యంలో ప్రత్యేక క్రతువు
- యాదగిరిగుట్ట పండితుల ఆధ్వర్యంలో 11 హోమగుండాలతో యాగం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, జలాశయాలు జలకళను సంతరించుకోవాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం సోమవారం 'మహా వరుణ యాగం' నిర్వహించింది. నాగార్జున సాగర్ సమీపంలోని కృష్ణా తీరంలో ఉన్న విజయ విహార్ వేదికగా ఈ క్రతువును శాస్త్రోక్తంగా జరిపించారు. యాగం ముగింపు సందర్భంగా నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ ఏడాది రుతుపవనాలు బలహీనంగా

2లో..

# దైవ నామాలను అపహాస్యం చేయొద్దు

**- వైసీపీపై పవన్ కల్యాణ్ ఆగ్రహం**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** దైవ నామాలను, భక్తి గీతాలను రాజకీయ ప్రయోజనాల కోసం పేరడీలుగా మార్చి అపహాస్యం చేయడాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తీవ్రంగా ఖండించారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి పవిత్ర నామాలను కించపరచడం దారుణమని ఆయన పేర్కొన్నారు. భక్తుల

2లో..

# నా రాజకీయ జీవితంలో ఇంత దౌర్భాగ్యపు పార్టీని చూడలేదు

**- 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు**

- కైకలూరులో భూ హక్కు పత్రాలు పంపిణీ చేసిన సీఎం చంద్రబాబు
- భూ కబ్జాదారుల పెత్తనానికి చరమగీతం పాడతామని హామీ
- వైసీపీ ఒక గొడ్డలి పార్టీ అని, రాష్ట్రంలో అరాచకాలు సృష్టిస్తోందని తీవ్ర విమర్శ



**అమరావతి (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో గొడ్డలి పార్టీ అరాచకాలకు, గంజాయి బ్యాచ్‌ల ఆగడాలకు శాశ్వతంగా చరమగీతం పాడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో హెచ్చరించారు.

దశాబ్దాలుగా నలుగుతున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో తాము పనిచేస్తుంటే, ప్రతిపక్ష వైసీపీ మాత్రం శాంతిభద్రతలకు విఘాతం కలిగించి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తోందని ఆయన మండిపడ్డారు. సోమవారం ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గంలోని కలిదిండిలో నిర్వహించిన భూ హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రతిపక్షంపై నిప్పులు చెరిగారు.

2లో..

# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో రగడ

**- మంత్రి పొంగులేటి వర్సెస్ పాడి కౌశిక్ రెడ్డి**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలంలో సోమవారం నిర్వహించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. మంత్రుల ప్రసంగాలపై స్థానిక హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఇరుపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రారంభోత్సవంతో పాటు, లబ్ధిదారులకు పట్టాల పంపిణీ నిమిత్తం రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత ప్రభుత్వం పనులను అసంపూర్తిగా వదిలేసిందని, రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు కేటాయించి పనులను పూర్తి చేసి, లబ్ధిదారులకు ఇళ్లను అందిస్తోందని వారు పేర్కొన్నారు.మంత్రుల వ్యాఖ్యలపై అదే వేదికపై ఉన్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తక్షణమే స్పందించారు. ఈ ఇళ్లను నిర్మించింది కేసీఆర్ ప్రభుత్వమని, మంత్రులు వాస్తవ విరుద్ధమైన ఆరోపణలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. "అబద్ధాలు చెప్పవద్దు.. కేవలం నిజాలే మాట్లాడండి.

2లో..

# ముగిసిన ఎస్ఐఆర్ డెడ్‌లైన్

**- తుది జాబితాపై తీవ్ర ఉత్కంఠ!**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో కీలక ఘట్టం ముగిసింది. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించేందుకు ఇచ్చిన గడువు నేటితో ముగిసింది. దీంతో రాష్ట్రంలో దాదాపు 71 లక్షల మంది ఓటర్ల వివరాలపై ఇప్పుడు తీవ్ర ఆసక్తి నెలకొంది. ఈ ఓటర్లను అన్‌కలెక్టబుల్ కేటగిరీలో గుర్తించిన నేపథ్యంలో తుది ఓటర్ల జాబితాలో వీరి పేర్లు కొనసాగుతాయా లేక తొలగిస్తారా అనేది కీలకంగా మారింది. తెలంగాణలో మొత్తం 3.38 కోట్ల మంది ఓటర్లు ఉండగా సుమారు 70.8 లక్షల మంది ఓటర్లకు సంబంధించిన ఎన్యూమరేషన్ ఫారాలు అందుబాటులో లేని లేదా సేకరించలేని కేటగిరీలో ఉన్నట్లు తాజా గణాంకాలు వెల్లడించాయి. ఈ సంఖ్య రాష్ట్రంలోని మొత్తం ఓటర్లలో దాదాపు 21 శాతానికి సమానమని ఎన్నికల సంఘం గణాంకాలు

2లో..

# ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడు పెద్ది

**- పెద్ది సుదర్శన్ రెడ్డి సంస్మరణ సభలో కేటీఆర్**

- దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డికి కేటీఆర్ నివాళి
- పెద్ది కుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ
- ప్రజల హృదయాల్లో పెద్ది చిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడిన కేటీఆర్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డికి ఘనంగా నివాళు లర్పించారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో సోమవారం నిర్వహించిన సంస్మరణ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నర్సంపేటలో నిర్మించనున్న మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెట్టనున్నట్లు కేటీఆర్ కీలక ప్రకటన చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ ఉద్యమాన్ని అగ్రభాగాన నిలిచి నడిపించిన గొప్ప నాయకుడు పెద్ది అని

2లో..

# నిర్మలమ్మ హామీ!

**- మూజువాణి ఓటుతో కీలక బిల్లుకు ఆమోదం**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** డిజిటల్ లావాదేవీలకు సంబంధించి దేశ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం ఊరటనిచ్చే ప్రకటన చేసింది. 'ట్యాక్సేషన్ అండ్ ఇతర చట్టాల(సవరణ) బిల్లు-2026' కు పార్లమెంట్ సోమవారం తన తుది ఆమోద ముద్ర వేసింది. లోక్‌సభ ఇప్పటికే ఆమోదించిన ఈ ద్రవ్య బిల్లును రాజ్యసభ సుదీర్ఘ చర్చ అనంతరం మూజువాణి ఓటుతో

2లో..

# కర్రెగుట్టల్లో ఎగిరిన మువ్వన్నెల జెండా

**- 650 అడుగుల ఎత్తులో త్రివర్ణ పతాకాన్ని ఎగరేసిన డీజీపీ**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఒకప్పుడు మావోయిస్టులకు కంచుకోటగా ఉన్న కర్రెగుట్టలు ఇప్పుడు మార్పు దిశగా అడుగులు వేస్తున్నాయి.దశాబ్దాలుగా సాధారణ ప్రజలకు, ప్రభుత్వ అధికారులకు దాదాపు అందనంత ప్రాంతంగా ఉన్న ఈ కొండల్లో తొలిసారిగా త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. స్వాతంత్ర్య

2లో..

# కొలంబియాను కుదిపేసిన భారీ భూకంపం

**- ప్రకృతి విలయానికి 69 మందికి పైగా మృతి**



**న్యూయార్క్ (ప్రశ్న న్యూస్)** పశ్చిమ కొలంబియాలో సోమవారం సంభవించిన భారీ భూకంపం పెను విషాదాన్ని మిగిల్చింది. రిక్టర్ స్కేలుపై 7.4 తీవ్రతతో నమోదైన ఈ భూప్రకంపనల కారణంగా 69 మందికి పైగా మరణించారు. వందలాది మంది

2లో..

# ఎల్‌నినో ప్రభావంపై రైతులకు శాస్త్రవేత్తల అవగాహన

**- సి.బెలగల్ మండలంలో ఎల్‌నినో కాంబాట్ బృందం పర్యటన..**

**- పంటల యాజమాన్యంపై సూచనలు**



**సి.బెలగల్,** ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని పంటల యాజమాన్యం చేపట్టాలని ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని ఎల్‌నినో కాంబాట్ శాస్త్రవేత్తల బృందం సూచించింది. కర్నూలు జిల్లా సి.బెలగల్ మండలంలోని పోలకల్, కొండాపురం, ముడుమాల, కొత్తకోట గ్రామాల్లో శాస్త్రవేత్తల బృందం పర్యటించి రైతులతో సమావేశమైంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, పంటల పరిస్థితిని పరిశీలించి రైతులకు పలు కీలక సూచనలు చేసింది.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సాంకేతిక సలహా మరియు శిక్షణ కేంద్రం (ఏరువాక కేంద్రం), కర్నూలు ప్రధాన శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ డా. ఆర్. శారద జయలక్ష్మీ దేవి, ప్రధాన శాస్త్రవేత్త డా. పి. సుజాతమ్మ, సీనియర్ శాస్త్రవేత్త డా. ఎస్. బాలాజీ నాయక్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. కె. మౌనిక, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు టి. కృష్ణ, ఎస్. ఆఫ్రిన్, జి. విజయలక్ష్మితో పాటు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.వర్షాభావాన్ని ఎదుర్కొనేలా పంటల ఎంపికప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులను చూసి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని శాస్త్రవేత్తలు సూచించారు. అందుబాటులో ఉన్న నీటి వనరులు, నేలలో ఉన్న తేమను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం లోటు ఏర్పడే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటి అవసరం కలిగిన స్వల్పకాలిక పంట రకాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.అంతరపంటల సాగు చేపట్టడం ద్వారా వాతావరణ ప్రతికూల పరిస్థితుల్లో పంట పూర్తిగా దెబ్బతినే ప్రమాదాన్ని తగ్గించుకోవడంతో పాటు రైతులకు అదనపు ఆదాయం లభించే అవకాశం ఉంటుందని వివరించారు. వర్షాలు ఆలస్యమయ్యే పరిస్థితుల్లో కొర్ర, పెసర, అలసంద, సజ్జ వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. పొలాలను ఖాళీగా ఉంచకుండా అందుబాటులో ఉన్న నేల తేమను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.నేలలో తేమ సంరక్షణకు ప్రాధాన్యంఇప్పటికే సాగులో ఉన్న పంటల్లో నేల తేమను సంరక్షించేందుకు తగిన చర్యలు చేపట్టాలని శాస్త్రవేత్తలు సూచించారు. కలుపు నివారణ, అంతర దుక్కులు, మల్చింగ్ వంటి పద్ధతులను పాటించడం ద్వారా నేలలోని తేమ ఎక్కువ కాలం నిల్వ ఉండేలా చేసుకోవచ్చని వివరించారు.బెట్టు పరిస్థితుల్లో పంటలకు తక్షణ పోషక సహాయం అందించేందుకు 19:19:19 లేదా పొటాషియం నైట్రేట్‌లో ఏదో ఒకదాన్ని లీటరు నీటికి 10 గ్రాముల చొప్పున కలిపి ఆకులపై పిచికారీ చేయాలని సూచించారు.పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తల బృందంశాస్త్రవేత్తల బృందం ఆయా గ్రామాల్లోని పంట పొలాలను సందర్శించి పంటల ప్రస్తుత పరిస్థితిని పరిశీలించింది. ముఖ్యంగా పత్తి పంటలో కనిపిస్తున్న చీడపీడలు, తెగుళ్ల ఉధృతిని పరిశీలించి రైతులకు సమగ్ర సస్యరక్షణ చర్యలపై సూచనలు ఇచ్చింది.ప్రస్తుతం పత్తి పంటలో రసం పీల్చే పురుగులైన పచ్చదోమ, తెల్లదోమ ఉధృతి కనిపిస్తున్నట్లు గుర్తించారు. వీటి నివారణకు ఫిప్రోనిల్ + ఫ్లోనికమైడ్ ఏ 160 మి.లీ./ఎకరం లేదా అఫిడాపైరోపెన్ ఏ 400 మి.లీ./ఎకరం లేదా ఎసిటామిప్రిడ్ ఏ 40 గ్రా./ఎకరం మందుల్లో తగినదాన్ని మాత్రమే శాస్త్రవేత్తలు లేదా వ్యవసాయ శాఖ అధికారుల సూచన మేరకు వినియోగించాలని తెలిపారు.ఆర్థిక నష్టపరిధి ఆధారంగానే పురుగుమందుల వినియోగంపంటలో చీడపీడలు కనిపించగానే విచక్షణారహితంగా పురుగుమందులను పిచికారీ చేయవద్దని శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. అవసరానికి మించి ఎరువులు, పురుగుమందులు వినియోగించడం వల్ల సాగు ఖర్చులు పెరగడంతో పాటు పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు.కాబట్టి రైతులు పంటలను నిరంతరం పరిశీలిస్తూ, చీడపీడల ఉధృతి ఆర్థిక నష్టపరిధి (ఇఒ) దాటినప్పుడు మాత్రమే తగిన పురుగుమందులను ఉపయోగించాలని సూచించారు. ఒకేసారి పలు రకాల మందులను కలిపి వినియోగించకుండా, సంబంధిత వ్యవసాయ అధికారులు లేదా శాస్త్రవేత్తల సలహా తీసుకుని తగిన మందును ఎంపిక చేసుకోవాలని పేర్కొన్నారు.

సమస్య తలెత్తిన వెంటనే అధికారులను సంప్రదించాలివాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల యాజమాన్యంలో మార్పులు చేసుకోవాలని, పంటల్లో ఏవైనా సమస్యలు తలెత్తిన వెంటనే సమీపంలోని ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు లేదా వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి సాంకేతిక సలహాలు పొందాలని శాస్త్రవేత్తల బృందం రైతులకు విజ్ఞప్తి చేసింది. ఎల్‌నినో వంటి వాతావరణ ప్రతికూల పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు శాస్త్రీయ పద్ధతులను పాటించడం ద్వారా పంట నష్టాలను తగ్గించుకోవచ్చని వారు తెలిపారు.

## పత్తికొండలో కదం తొక్కిన విద్యార్థులు, నిరుద్యోగ యువత

**- డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాలలో జరిగిన అక్రమాలపై సీబీఐ విచారణ చేపట్టాలి:**

**- మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ**



**పత్తికొండ** పత్తికొండలో విద్యార్థులు, నిరుద్యోగ యువత కదం తొక్కారు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో జరిగిన అక్రమాలు, అవకతవకలపై సీబీఐతో సమగ్ర విచారణ చేపట్టాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి వెంటనే చెల్లించాలని, విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ ఆధ్వర్యంలో విద్యార్థులు, నిరుద్యోగ యువత పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు.స్థానిక వైఎస్‌ఆర్‌సీపీ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ మీదుగా అంబేద్కర్ కూడలి వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని, డీఎస్సీ నియామకాల్లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత చేపట్టిన ఈ ర్యాలీతో పత్తికొండ పట్టణంలో నిరసన వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ మాట్లాడుతూ.. ప్రజలను తప్పుదోవ పట్టించడమే చంద్రబాబు నైజమని మరోసారి రుజువైందని విమర్శించారు. డీఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలపై వైఎస్‌ఆర్‌సీపీ బాధితుల పక్షాన నిలబడి ప్రశ్నిస్తుంటే, తామేదో నిజంగా ప్రతిభతో ఉద్యోగాలు పొందిన వారికి వ్యతిరేకమనే విధంగా ధర్నాలు, ఆందోళనలు చేయించడం సిగ్గుచేటని అన్నారు.డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో జరిగిన నియామకాలపై అనేక అనుమానాలు, ఆరోపణలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో వాటిపై పారదర్శకంగా విచారణ జరిపించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కేవలం ఆరోపణలను ఖండించడం, ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నాలు చేయడం కాకుండా, వాస్తవాలు వెలుగులోకి రావడానికి సీబీఐతో సమగ్ర దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు.డీఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలు, అవినీతిపై వైఎస్‌ఆర్‌సీపీ అధినేత జగనన్న ప్రశ్నిస్తూ సీబీఐ విచారణ కోరడం ప్రభుత్వానికి తెలియదా అని ప్రశ్నించారు. నిజంగా తప్పులు జరగలేదని ప్రభుత్వం భావిస్తే సీబీఐ విచారణకు ఎందుకు వెనుకాడుతోందని నిలదీశారు. విచారణ జరిపించి నిజానిజాలు తేల్చాల్సింది పోయి, ప్రజల దృష్టిని మరల్చేందుకు ప్రయత్నించడం సరికాదన్నారు.ఎన్నికల సమయంలో విద్యార్థులు,నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కంగాటి శ్రీదేవమ్మ డిమాండ్ చేశారు.

నిరుద్యోగులకు హామీ ఇచ్చిన నిరుద్యోగ భృతిని చెల్లించడంతో పాటు, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు.ఉద్యోగాల కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతను ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేయడం తగదని అన్నారు. విద్యార్థుల చదువులు మధ్యలో ఆగిపోకుండా, నిరుద్యోగ యువతకు ఆర్థిక భరోసా కల్పించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాలతో పాటు అన్ని ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. విద్యార్థులు, నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం వైఎస్‌ఆర్‌సీపీ ఎల్లప్పుడూ వారి పక్షాన నిలబడుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా మొండి వైఖరి వీడి విద్యార్థులు, నిరుద్యోగ యువత సమస్యలను పరిష్కరించాలని కంగాటి శ్రీదేవమ్మ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వైఎస్‌ఆర్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్ రెడ్డి , మాజీ ఎంపీపీ నాగరత్నమ్, అనుబంధ సంఘాల రాష్ట్ర కమిటీ నాయకులు, అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులు, పత్తికొండ,తుగ్గలి,మద్దికేర,కృష్ణగిరి, వెల్దుర్తి మండలాల కన్వీనర్లు, ఎంపీపీలు, జడ్పిటిసిలు,మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు లు నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## మిడ్ మ్యానేర్ బ్యాక్ వాటర్‌కి వచ్చే పర్యాటకుల భద్రతకు చర్యలు

**రాజన్న సిరిసిల్ల** తంగళ్లపల్లి మండలం గోపాలరావుపల్లి గ్రామ శివారులోని మిడ్ మ్యానేర్ బ్యాక్ వాటర్ ప్రాంతాన్ని సోమవారం రోజు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పోలీసు అధికారులతో కలిసి సందర్శించారు.ఈసందర్భంగా బ్యాక్ వాటర్ ప్రాంతంలో పర్యాటకుల భద్రత కోసం చేపడుతున్న చర్యలను పరిశీలించారు.పర్యాటకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని, నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.బ్యాక్ వాటర్ పరిసరాల్లోని ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి, పర్యాటకులు ఆయా ప్రాంతాలకు వెళ్లకుండా అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా చిన్నారులు, కుటుంబాలతో వచ్చే పర్యాటకుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఆదేశించారు.పర్యాటకులు పోలీసుల సూచనలు, హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని, నీటి ప్రాంతాలకు దూరంగా ఉండాలని, ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, సరదా విషాదంగా మారకుండా చూసుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు.ఎస్పీ వెంట డిఎస్పీ నాగేంద్రచారి, సిబ్బంది ఉన్నారు.

## విజయవంతంగా "జైలు బరో"


# సిపిఎం నాయకులు అరెస్ట్



**మధిర** పట్టణంలో ఈరోజు సిఐటియు వ్యవసాయ కార్మిక సంఘం మరియు రైతు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన జైలు బరో కార్యక్రమంలో సిపిఎం డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు మరియు నాయకులు శీలం నరసింహారావు మందా సైదులు పాపినేని రామ నరసయ్య పడకంటి మురళి మరియు ఇతర నాయకులు పాల్గొని అరెస్టు కావడం జరిగింది. మొదట సిఐటియు వ్యవసాయ కార్మిక సంఘం రైతు సంఘం నాయకులు స్థానిక ఎండిఓ కార్యాలయం ఎదుట సమావేశం నిర్వహించి పెద్ద సంఖ్యలో హమాలి వర్కర్లు ఆశ వర్కర్లు మధ్యాహ్న భోజన వర్కర్లు అంగన్వాడి టీచర్ మరియు వర్కర్లు ఆర్డబ్ల్యూఎస్ వర్కర్లు ఇంకా ఇతర స్కీం వర్కర్లు, వ్యవసాయ కార్మికులు రైతులు పాల్గొని తమ డిమాండ్ల సాధన కోసం నినాదాలు చేశారు అనంతరం భగత్ సింగ్ విగ్రహం వద్ద బ్రిడ్జి నుండి రాకపోకలను రాస్తారోకో నిర్వహించి అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక రైతు వ్యతిరేక వ్యవసాయ కార్మికులకు వ్యతిరేక చట్టాలను చేస్తూ సాధారణ ప్రజలను మరింత పేదలుగా మార్చే కుట్ర చేస్తుందని వారి హక్కులను కాల రాస్తుందని దీనికి నిరసనగా దేశవ్యాప్తంగా ఈరోజు ప్రజాసంఘాలుదేశవ్యాప్తంగా ఈరోజు ప్రజాసంఘాలు ఇచ్చినపిలుపులోభాగంగా పెద్దఎత్తునఆందోళననిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. రానున్నరానున్న కాలంలో ప్రజలసమస్యల పరిష్కారంకోసం మరిన్నిరానున్న కాలంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం మరిన్ని పోరాటాలకు ప్రజలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. పోలీసుల అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు శీలం నరసింహారావు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మంద సైదులు వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ కార్యదర్శి పాపినేని రామ నరసయ్య సిఐటియు పట్టణ కన్వీనర్ పడకంటి మురళి రైతు సంఘం మండల కార్యదర్శి మందడపు ఉపేంద్ర రావు వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు అంగడాల అమరయ్య షేక్ ఉద్దండు సాహెబ్ నాయకులు తేలపోలు రాధాకృష్ణ ఓట్ల శంకర్రావులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్కు తరలించారు. వివిధ ప్రజాసంఘాల నాయకులను కార్యకర్తలను ఈ సందర్భంగా పోలీసులు అరెస్టు చేసి స్టేషన్కు తరలించారు

## జిల్లా పోలీస్ కార్యాలయంలో

# పి.జి.ఆర్.ఎస్. కార్యక్రమం



**తిరుపతి,** సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పి.జి.ఆర్.ఎస్. కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి మొత్తం 64 పిటిషన్లను స్వీకరించారు.ఫిర్యాదుదారుల సమస్యలను అధికారులు ఓర్పుతో ఆలకించి, ప్రతి పిటిషన్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. అందిన ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి, అవసరమైన చట్టపరమైన చర్యలను వేగవంతంగా తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రతి పిటిషన్‌ను వెంటనే సంబంధిత అధికారులకు పంపించి, ప్రాధాన్యత ఆధారంగా విచారణ పూర్తి చేసి నిర్ణీత గడువులో పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం, నిర్లక్ష్యానికి ఎట్టి పరిస్థితుల్లోనూ తావు ఉండకూడదని స్పష్టం చేశారు.బాధితులకు సకాలంలో న్యాయం అందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును చట్టపరంగా, పారదర్శకంగా పరిశీలించి తగిన పరిష్కారం అందించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడం, వారి సమస్యలకు సత్వర పరిష్కారం కల్పించడం జిల్లా పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు శ్రీశ్రీనివాసులు (పరిపాలన), రవిమనోహర్ ఆచారి (శాంతిభద్రతలు), పి.జి.ఆర్.ఎస్. సీఐ సుదర్శనరావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది మరియు ఫిర్యాదుదారులు పాల్గొన్నారు.

## హైదర్‌షాకోట్‌లో ఘోర రోడ్డు ప్రమాదం..

**రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి మృతి**




**హైదరాబాద్:** హైదర్‌షాకోట్‌లోని ఎస్‌ఎంపీ స్కూల్ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతివేగంగా వచ్చిన మహీంద్రా ౫౨జ౦ 350 కారు రోడ్డుపై వెళ్తున్న రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగిని ఢీకొట్టడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు.కారు ఢీకొట్టిన తీవ్రతకు బాధితుడు గాల్లోకి ఎగిరి రోడ్డుపై పడినట్లు స్థానికులు తెలిపారు. ఇదే సమయంలో రాపిడో బైక్‌పై వెళ్తున్న మరో ఇద్దరిని కూడా కారు ఢీకొనడంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరి కాలు విరిగినట్లు సమాచారం. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.ప్రమాదం అనంతరం కారులో ఉన్న నలుగురు యువకులు వాహనాన్ని అక్కడే వదిలి పరారైనట్లు స్థానికులు చెబుతున్నారు. కారు నంబర్ ఆధారంగా పోలీసులు వివరాలు సేకరించగా, వాహనం శంషాబాద్‌కు చెందినదిగా గుర్తించినట్లు సమాచారం.సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి అతివేగమే కారణమా, డ్రైవర్ మద్యం సేవించి ఉన్నాడా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.

## వ్యభిచార గృహాలపై పోలీసుల దాడి

**- ముగ్గురు ముద్దాయిలు అరెస్టు ఒకరు పరారీ**

**- బద్వేలు అర్బన్ సీఐ రామకృష్ణ**



**బద్వేలు** బద్వేల్ టౌన్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు, బద్వేల్ అర్బన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బి. రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఆదివారం సీఐ రామకృష్ణ ఈ కేస్ కు సంబంధించిన వివరాలు వెల్లడించారు బద్వేల్ టౌన్, నెల్లూరు మెయిన్ రోడ్, మార్థోమ నగర్, ఘుమఘుమలు రెస్టారెంట్ ఎదురుగా గల వీధిలోని ఇంటి నెం. 4-2-4/డి వద్ద మరియు బద్వేల్ టౌన్ లోని కింగ్ ప్లాజా రెస్టారెంట్ వెనుక వైపున వీధి లోని ఇంటి నెం. 4-3-95/1 వద్ద తనిఖీలు నిర్వహించగా, అక్కడ రెండిళ్లలో డి యెల్లారెడ్డి , 50 సంవత్సరాలు, అట్లూర్ మండలం , మిట్టి వెంకట లక్ష్మి 40 సంవత్సరాలు , రాజమండ్రి టౌన్ జగన్నాథం సుబ్బయ్య, 35 సంవత్సరాలు, భాకరాపేట జగనన్న కాలనీ , బద్వేల్ టౌన్ ఉన్నట్లు గుర్తించారు.ప్రాథమిక విచారణలో, పై వ్యక్తులు ఇతర ప్రాంతాలకు చెందిన మహిళలను బద్వేల్‌కు పిలిపించి, విటులను సమకూర్చి వ్యభిచార కార్యకలాపాలను నిర్వహిస్తూ సంపాదన చేసుకొంటున్నట్లు వెల్లడైనది. విచారణలో కందుల శ్రీలక్ష్మి దేవి కూడా ఈ వ్యవహారంలో సంబంధం ఉన్న వ్యక్తిగా గుర్తించబడింది, ఆమె పరారిలో వుంది.తనిఖీలో కామసూత్ర బ్రాండ్‌కు చెందిన 01 కండోమ్ బాక్స్‌లోని 06 ప్యాకెట్లు, 4 మొబైల్ ఫోన్స్ ను స్వాధీనం చేసుకోవడమైనది.స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లు నిందితులు విటులతో సంప్రదింపులు జరపడం మరియు వ్యభిచార కార్యకలాపాలకు సంబంధించి సమాచారాన్ని చేరవేయడం కోసం ఉపయోగించినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైనది. ఈ ఘటనకు సంబంధించి .ఎల్లా రెడ్డి , మిట్టి వెంకట లక్ష్మి మరియు జగన్నాథం సుబ్బయ్యలను అరెస్టు చేయడము జరిగింది. అలాగే కందుల శ్రీలక్ష్మి దేవిని కేసులో నిందితురాలిగా గుర్తించి, తదుపరి దర్యాప్తు చేపట్టడం జరిగింది.పై సంఘటనలకు సంబందించిన రెండు కేసులు కింద నమోదు చేయబడినాయి ముద్దాయిలను కోర్టు ముందు హాజరుపరిచెదము. ఇందులో పట్టుబడిన ఐదు మంది బాదితురాళ్ళను కడపలో వన్ స్టాప్ సెంటర్ కు పునరావాసము కొరకు పంపడమైనది.ఈ సందర్భంగా బద్వేల్ అర్బన్ పోలీసుల తరఫున ప్రజలకు తెలియజేయునది ఏమనగా, పట్టణంలో వ్యభిచార కార్యకలాపాలు, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు కఠినంగా కొనసాగుతాయని, ఇలాంటి కార్యకలాపాల గురించి సమాచారం ఉన్నట్లయితే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా పోలీసు అధికారులకు సమాచారం అందించాలని కోరడమైనది, సమాచారం యిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయి

## ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా, విభజన హామీలు ఎక్కడ?

**- సిపిఐ గురజాల నియోజకవర్గ కార్యదర్శి మందపాటి రమణారెడ్డి డిమాండ్**



**దాచేపల్లి** ఆంధ్రప్రదేశ్ కి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయటంలో కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వము పూర్తిగా విఫలమైందని సిపిఐ గురజాల నియోజకవర్గ కార్యదర్శి మందపాటి రమణారెడ్డి అన్నారు. ఆదివారం దాచేపల్లిలో లైబ్రరీ సెంటర్ నందు సిపిఐ ప్రచార యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ, ఆగస్టు 6 నుండి 15 వరకు దేశవ్యాప్తంగా పాదయాత్ర, ప్రచార యాత్రలు నిర్వహిస్తున్నామని అన్నారు. సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రత్యేక హోదా ఇవ్వకుండా విభజన చట్టాలు కూడా అమలు చేయలేదన్నారు. సంవత్సరానికి కోటి ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, ఉద్యోగాలు ఇవ్వకుండా అనేక పరిశ్రమలు మూత పడ్డాయి అన్నారు. ధరల పెరుగుదలను తక్షణమే అరికట్టాలన్నారు. సార్వత్రిక విద్య ఆరోగ్యం అందుబాటులోకి తేవాలన్నారు. పంటలకు కనీసం మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలన్నారు. దళిత ఆదివాసీలపై ఆకృత్యాలను దౌర్జన్యాలను నిలిపి వేయాలన్నారు. బిజెపి ప్రభుత్వంలో కార్మిక చట్టాలను సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. మహిళా రిజర్వేషన్లను తక్షణం అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ దాచేపల్లి పట్టణ కార్యదర్శి ఎడ్ల. భాస్కర్, రేపూరి. రామయ్య, మురికిపూడి సర్వయ్య, ఎం. రాజశేఖర్, శ్రీపతి కోటేశ్వరరావు, ఆనంద్ కుమార్, బి. నాసరయ్య, కే. శ్రీను, బి. వెంకట్రావు, ఈ రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

# శ్రావణానికి కొలువుదీరుతున్న కొండమ్మ

**12న ఆషాఢ సారె ముగింపు.. 13 నుంచి శ్రావణ మాస వేడుకలు**

**భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలి**

**15న రాజగోపురం ప్రాంగణంలో స్వాతంత్ర్య వేడుకలు: ఈవో శీనా నాయక్**



విజయవాడ(ప్రశ్న న్యూస్) ఆషాఢ మాసం ముగింపు, శ్రావణ మాస ప్రారంభం నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విస్తృత ఏర్పాట్లు చేయాలని దేవస్థానం ఈవో శీనా నాయక్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు దేవస్థానం కార్యనిర్వహణాధికారి కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులు, స్థానాచార్య, వైదిక కమిటీ సభ్యులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆషాఢ సారె ముగింపు ఉత్సవాలు, శ్రావణ మాసంలో నిర్వహించనున్న పూజలు, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై చర్చించారు. ఈ నెల 12తో ఆషాఢ మాసం ముగియనున్న నేపథ్యంలో ఆ రోజు ఉదయం 8.30 గంటలకు దేవస్థానం సిబ్బంది ఆధ్వర్యంలో సారె సమర్పణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు అధికారులు ఈవోకు వివరించారు. జమ్మిదొడ్డి నుంచి సారె సమర్పణ కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యక్రమం సజావుగా జరిగేలా అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఈవో సూచించారు. ఆగస్టు 13 నుంచి శ్రావణ మాసం ప్రారంభం కానుండటంతో ఆలయానికి భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు ఏర్పాట్లు చేయాలని శీనా నాయక్ అధికారులను ఆదేశించారు. భక్తులకు దర్శనం, పూజలు, ప్రసాదాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. శ్రావణ మాసంలో నిర్వహించే కుంకుమార్చన, వరలక్ష్మి వ్రతం వంటి ఆర్జిత సేవలకు సంబంధించి ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా భక్తుల సౌకర్యార్థం ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా దర్శనం క్యూ లైన్లను సిద్ధం చేయాలని, క్యూలైన్లలో భక్తులకు తాగునీటి సదుపాయం అందుబాటులో ఉండేలా చూడాలని ఈవో సూచించారు. ఉచిత ప్రసాదం, అన్నప్రసాదం పంపిణీ విషయంలోనూ ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. భక్తుల రాకపోకలు, దర్శన ఏర్పాట్లు, పూజా కార్యక్రమాలు, ప్రసాదాల పంపిణీ తదితర అంశాలపై సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలించి కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని శీనా నాయక్ పేర్కొన్నారు. శ్రావణ మాసంలో భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆగస్టు 15న నిర్వహించనున్న భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలపైనా సమావేశంలో చర్చించారు. దేవస్థానం ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు వివిధ విభాగాలకు ఈవో బాధ్యతలు అప్పగించారు. ఈసారి ప్రధాన రాజగోపురం ప్రాంగణంలో జెండా వందనం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని శీనా నాయక్ ఆదేశించారు. కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లను సంబంధిత విభాగాలు సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు.. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో దేవస్థాన సిబ్బందికి అభినందన పురస్కారాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఈవో అధికారులను ఆదేశించారు. విధుల్లో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని గుర్తించి వారిని ప్రోత్సహించేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. ఆషాఢ సారె ముగింపు, శ్రావణ మాస ప్రారంభం, స్వాతంత్ర్య దినోత్సవం.. వరుస కార్యక్రమాల నేపథ్యంలో అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఈవో శీనా నాయక్ సూచించారు. సమీక్షా సమావేశంలో దేవస్థానం వివిధ విభాగాల అధికారులు, స్థానాచార్య, వైదిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎల్ఎన్ మాధవ్‌కు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు



ఇబ్రహీంపట్నం(ప్రశ్న న్యూస్) భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎల్ఎన్ మాధవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఇబ్రహీంపట్నం రూరల్ మండల బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం కేతనకొండ గ్రామంలోని పార్టీ కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల బీజేపీ అధ్యక్షురాలు పయ్యావుల జయలక్ష్మి రాము అధ్యక్షతన కేక్ కట్ చేసి రాష్ట్ర అధ్యక్షుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు పీవీఎల్ఎన్ మాధవ్ రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషిని కొనియాడారు. ఆయన నాయకత్వంలో భారతీయ జనతా పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలకు మరింత సేవ చేసే శక్తి, ఆయురారోగ్యాలు కలగాలని కోరుతూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గంపసంతలు గణపతి, నరాలశెట్టి రమేష్, నప్పా హరిబాబు, కొరివి శ్రీనివాసరావుతో పాటు పార్టీ కార్యకర్తలు పాల్గొని పీవీఎల్ఎన్ మాధవ్ చిత్రపటానికి పూలమాల వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# లియోనార్డ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ 2026, బెస్ట్ ఎక్సలెంట్ పోయెట్ విన్నర్ అవార్డ్ అందుకున్న కవిరత్న అమీనా కలందర్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ భాషా సంస్కృతిక శాఖ, ప్రసన్న ఆరూహి ఆర్ట్స్ అండ్ కల్చరల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో లియోనార్డ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ (హై అచీవర్) ఇంటర్నేషనల్ మైల్ స్టోన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ (బెస్ట్ పెర్ఫార్మర్) కార్యక్రమం ఆదివారం హిమాయత్ నగర్ అలైడ్ అర్టిస్ ఆడిటోరియం, శ్రీముఖ కాంప్లెక్స్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కవిరత్న అమీనా కలెందర్ కి లియోనార్డ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ 2026, బెస్ట్ ఎక్సలెంట్ పోయాట్ అవార్డ్ విన్నార్ ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రసన్న ఆరూహి ఆర్ట్ అండ్ కల్చరర్ సోసైటీ అధ్యక్షురాలు డా. చందోలు ప్రసన్న , డా. ఆలూరి విల్సన్, ఆలూరి ఆర్ట్ అండ్ కల్చరర్ అకాడమి చైర్మన్, సముద్రుడు ఫెమ్ హీరో రమాకాంత్, నటుడు మా కమిటీ సభ్యుడు మాణిక్యరావు, ధర్వకులు, నిర్మాత శేషు, చిత్రప్రభా ఎడిటర్, నిర్మాత గుర్రపు విజయ కుమార్‌లు, నటులు రాబోయే హీరోయిన్ సుష్మిత అందజేశారు. ఈ కార్యక్రమంలో అంజనీ కుమారి, సీనియర్ సుపరింటెండెంట్ ఆఫ్ హైకోర్ట్, గాయని గాయకులు పల్లిపాముల శ్రీనివాసరావు, ఎంపీ, శ్రీనివాస రావు, మున్నా భాయ్, గుర్రపు శ్రీనివాసులు, సమీర్, దినేష్ కుమార్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# కర్రెగుట్టపై త్రివర్ణం.. 50 ఏళ్ల తర్వాత చరిత్ర

**డీజీపీ పర్యటనతో కొత్త అధ్యాయం**

**పర్యాటక కేంద్రంగా మారే దిశగా అడుగులు**

**మావోయిస్టు కార్యకలాపాలకు కేంద్రం నుంచి శాంతి కేంద్రంగా మార్పు.**

**భద్రతా బేస్ క్యాంపులు పరిశీలించిన డీజీపీ సీవీ ఆనంద్.**

**స్థానికులకు ఉపాధి, అభివృద్ధికి రోడ్లు, పర్యాటక ప్రణాళికలు.**



-ములుగు జిల్లా(ప్రశ్నన్యూస్)వాజేడు వెంకటాపురం మండలలోఒకప్పుడు తుపాకీ మోతలతో మారుమోగిన కర్రెగుట్టలు. నేడు త్రివర్ణ పతాకం రెపరెపలతో జాతీయ గర్వాన్ని చాటుతున్నాయి. మావోయిస్టు కార్యకలాపాలకు నిలయంగా పేరొందిన తెలంగాణ--ఛత్తీస్‌గఢ్ సరిహద్దు కర్రెగుట్టలో సోమవారం చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. సుమారు ఐదు దశాబ్దాల తర్వాత కొండ శిఖరంపై జాతీయ జెండా ఎగురడం స్థానికుల్లో కొత్త భరోసా నింపింది. తెలంగాణ డీజీపీ డాక్టర్ సీవీ ఆనంద్ ఈ ప్రాంతంలో పర్యటించి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆ క్షణం కర్రెగుట్ట చరిత్రలోనే మరపురాని రోజుగా నిలిచింది.

### భద్రతలో కొత్త విశ్వాసం.

ఏళ్ల తరబడి భద్రతా సవాళ్లతో సతమతమైన ఈ సరిహద్దు ప్రాంతంలో ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారాయి. పోలీస్ బలగాలు, సీఆర్‌పీఎఫ్ జవాన్ల సమన్వయంతో చేపట్టిన కూంబింగ్ ఆపరేషన్లు, బేస్ క్యాంపుల ఏర్పాటు ఫలితంగా మావోయిస్టు ప్రభావం తగ్గుముఖం పట్టింది. డీజీపీ సీవీ ఆనంద్ కర్రెగుట్టలోని పోలీస్, సీఆర్‌పీఎఫ్ బేస్ క్యాంపులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బలగాలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రాంతంలో శాంతి భద్రతలను మరింత పటిష్టం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనతో ప్రజల్లో భద్రతా భావన మరింత పెరిగిందని స్థానికులు చెబుతున్నారు.

### అభివృద్ధి వైపు అడుగులు..

ఇక కర్రెగుట్టను అభివృద్ధి కేంద్రంగా మార్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. కొండలు, దట్టమైన అడవులు, సహజ సిద్ధమైన జలపాతాలతో నిండిన ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దాలని అధికారులు భావిస్తున్నారు. ఇందులో భాగంగా కర్రెగుట్టకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించడం, ప్రకృతి అందాలను పర్యాటకులకు చేరువ చేయడం ప్రధాన లక్ష్యాలు. పర్యాటకం ఊపందుకుంటే గిరిజనులకు, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయనే ఆశాభావం వ్యక్తమవుతోంది. హోంస్టేలు, గైడ్లు, చిన్న వ్యాపారాలకు ఊతం లభించే అవకాశం ఉంది.

### 50 ఏళ్ల నిరీక్షణకు తెర..

కర్రెగుట్టపై జాతీయ జెండా ఎగురడం అనేది కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాదు. భయం, అనుమానాల నీడల నుంచి ఆ ప్రాంతం బయటపడిందనడానికి సంకేతం. గతంలో అడుగుపెట్టాలంటేనే జంకిన ప్రాంతంలో ఇప్పుడు జాతీయ పతాకం గర్వంగా ఎగురుతోంది. ఈ దృశ్యం చూసిన స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. "మా ఊరి కొండపై ఇన్నేళ్లకు జెండా ఎగిరింది. ఇప్పుడు మాకు భయం లేదు. అభివృద్ధి వస్తుందనే నమ్మకం వచ్చింది" అని వాజేడు గ్రామస్తులు చెప్పారు. ప్రభుత్వం, పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యలతో కర్రెగుట్ట త్వరలో తెలంగాణకు మరో ఆకర్షణీయ పర్యాటక కేంద్రంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమం.

**- పేదల పొట్టలు గొట్టి సంపన్నులకు సేవలు చేస్తున్న మోడీ.**

**- లేబర్ కోడ్స్ రద్దు అయ్యే వరకు ఉద్యమం. - సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు.**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమం చేస్తామని, పేదల పొట్టలు గొట్టి సంపన్నులకు సేవలు చేస్తున్న మోడీ నిరంకుశ విధానాలపై లేబర్ కోడ్స్ రద్దు అయ్యే వరకు ఉద్యమం చేస్తామని సీఐటీయూ మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు హెచ్చరించారు. కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా మరియు ూ×ఖూ, ూ×ూాఔఖ సంఘాల జైలు భరో జాతీయ పిలుపులో భాగంగా సోమవారం నర్సాపూర్ పట్టణంలో చిల్డ్రన్స్ పార్క్ నుండి బస్సు స్టాప్ వరకు ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చెప్పటారు . ఈ కార్యక్రమన్ని ఉద్దేశించి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు మాట్లాడుతూలి క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్పొరేట్, మతోన్మాద విధానాలపై దేశ వ్యాప్త ఉద్యమం చేస్తున్నామని అన్నారు. 12 ఏండ్ల నుండి దేశాన్ని పరిపాలిస్తున్న మోడీ దేశ సంపదను పెట్టుబడిదారులకు కట్టబేడుతున్నారని అన్నారు. మతోన్మాద, కార్పొరేట్ విధానాలు అమలు చేసి ప్రజలపై భారలు వేసే హక్కు మోడీకి ఎక్కడిదని అన్నారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్స్ ఎవ్వరి ప్రయోజనాల కోసం అమలు చేస్తున్నారని మండిపడరు. లేబర్ కోడ్స్ అమలు చెయడం అంటే కార్మికుల శ్రమాను పెట్టుబడిదారులకు దోచిపెట్టడమే అవుతుందని అన్నారు. విద్యుత్ రంగాన్ని ప్రయివేట్ చేసి రైతులపై భారలు వేయాలని మోడీ ప్రభుత్వం చూస్తుందని గుర్తుచేసారు . ఉచిత విద్యుత్తు రద్దు చేసి రైతులపై భారలు వేస్తుందని అన్నారు. ప్రయివేట్ విద్యుత్ సంస్థల లాభాలా కోసం ప్రభుత్వ విద్యుత్ సంస్థలను నిర్వీర్యం చేస్తుందని, రైతులతో పాటు ఇండ్లకు స్మార్ట్ మీటర్స్ బిగించాలని మోడీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పికొడుతామణి అన్నారు. ఉచిత విద్యుత్ రద్దు చేయడానికి మోడీ ప్రభుత్వం ఆలోచన చేస్తుందని అన్నారు. విత్తన సవరణ చట్టం అమలు చేసి విదేశీ విత్తనా సంస్థలకు లాభాలు తేవడమేనా దేశ భక్తి అని అన్నారు. మోడీ ప్రభుత్వం విదేశాలతో వాణిజ్య ఒప్పందలు చేసుకుంటుందని 34 రకాల సరకులను విదేశాల నుండి దిగుమతి చేసుకోవడం అంటే దేశంలో రైతులు పండించే పంటలకు గిట్టుబాటుధరలు లేక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. విద్యుత్ ఛార్జిల పెంపు, విత్తనా బిల్లు, స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందల వలన దేశంలోని రైతులను వ్యవసాయ రంగం నుండి బయటకు నెట్టెందుకు కుట్రలు చేస్తున్నారని, కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకుండా మోడీ నిరుద్యోగ యువతను మోసం చేస్తున్నారని అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు వి బి గ్రామ్ జి పథకాన్ని అమలు చేస్తున్నారని, గ్రామీణ ప్రాంతంలోని ఉపాధి కూలీల పొట్టగొట్టేందుకు మోడీ చేస్తున్న కుట్రలు తిప్పోకోడతామణి అన్నారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో మోడీ ప్రభుత్వ విధానాలపై ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చంద్రయ్య, రమేష్, రాములు, అశోక్, నర్సింలు, శంకర్ పుష్ప, లక్ష్మి, షూఖుర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డలపై పూటకో అఘాయిత్యం.. రోజుకో నేరం

**- జగన్ హయాంలో మహిళల రక్షణను గాలికొదిలేశారు - ప్రియాంక ఘటనపై రాజకీయాలు చేయడం సరికాదు.**

**- ఐదేళ్లు పట్టించుకోని జగన్ ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారు: ఎమ్మెల్యే ప్రత్తిపాటి**



గుంటూరు(ప్రశ్న న్యూస్) వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్ల కాలంలో ఆడబిడ్డల రక్షణను విస్మరించారని, మహిళలపై నేరాలు పెరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని రాజమహేంద్రవరం పార్లమెంట్ టీడీపీ కో-ఆర్డినేటర్, ఎమ్మెల్యే ప్రత్తిపాటి ఆరోపించారు. ఇప్పుడు ప్రియాంక ఘటనను రాజకీయ అంశంగా మార్చి ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదన్నారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన పలు విమర్శలు చేశారు.

### ప్రభుత్వం సకాలంలో స్పందించింది

వైద్య విద్యార్థిని ప్రియాంక మృతి తీవ్ర విచారకరమని ప్రత్తిపాటి పేర్కొన్నారు. వైద్యురాలిగా ప్రజలకు సేవ చేయాల్సిన యువతి మద్యం మత్తులో ఉన్న ఇద్దరు యువకుల దుశ్చర్య కారణంగా ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. ఘటనపై ప్రభుత్వం, ముఖ్యమంత్రి వెంటనే స్పందించి బాధితురాలికి మెరుగైన వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. ప్రియాంకను కారుతో ఢీకొన్న నిందితులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి జిల్లా ఎస్పీని ఆదేశించారని, యువతి మృతిచెందిన అనంతరం కుటుంబానికి ఆర్థిక సాయం ప్రకటించడంతో పాటు ప్రభుత్వపరంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారని చెప్పారు. పోలీసుల దర్యాప్తుపై తమకు నమ్మకం ఉందని మృతురాలి తండ్రి స్వయంగా చెప్పారని ప్రత్తిపాటి పేర్కొన్నారు.

### ఘటనను రాజకీయానికి వాడుకోవద్దు

ప్రియాంక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో ఆమె కుటుంబ సభ్యుల వేదనను జగన్ పట్టించుకోలేదని ప్రత్తిపాటి విమర్శించారు. ఇప్పుడు యువతి మృతిచెందిన తర్వాత పోలీసు వ్యవస్థపై విమర్శలు చేయడం వెనుక రాజకీయ ఉద్దేశం ఉందని ఆరోపించారు.
ప్రియాంక ఘటనలో ప్రభుత్వం సకాలంలో స్పందించలేదని, పోలీసులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని జగన్ చేసిన వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధమన్నారు. ప్రతి ఘటనను ప్రభుత్వ వైఫల్యంగా చిత్రీకరించి రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. వైద్య విద్యార్థిని మరణాన్ని కూడా రాజకీయ అంశంగా మార్చడం ప్రజలు ఆమోదించరన్నారు.

### 'మహిళల రక్షణను పట్టించుకోలేదు'

జగన్ పాలనలో రాష్ట్రంలో నేరాలు, ఘోరాలు పెరిగాయని ప్రత్తిపాటి ఆరోపించారు. మహిళలపై అత్యాచారాలు, గృహహింస, వేధింపుల వంటి ఘటనలు పెరిగినట్లు జాతీయ నేర గణాంకాల బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) నివేదికలు వెల్లడించాయని పేర్కొన్నారు. 2019-23 మధ్య మహిళలపై నేరాలు జరుగుతున్నా అప్పటి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోలేదన్నారు. గంజాయి, మాదకద్రవ్యాలు, కల్తీ మద్యం వంటి వాటి నియంత్రణలో గత ప్రభుత్వం విఫలమైందని, వాటి ప్రభావం కూడా నేరాల పెరుగుదలకు కారణమైందని ప్రత్తిపాటి ఆరోపించారు. మహిళల రక్షణ కోసం దిశ చట్టం తెచ్చామని అప్పట్లో జగన్ ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, నిందితులకు కఠిన శిక్షలు పడేలా చేయడంలో విఫలమైందన్నారు.

### 'ప్రజల్లో అసంతృప్తి పెంచడమే లక్ష్యం'

రాష్ట్రంలో ఎక్కడ ఏ ఘటన జరిగినా దానిని ప్రభుత్వ వైఫల్యంగా చిత్రీకరించి ప్రజల్లో అసంతృప్తి పెంచేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారని ప్రత్తిపాటి ఆరోపించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ప్రతికూల వాతావరణం సృష్టించేందుకు రాజకీయంగా విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు. నేరస్తులను పరామర్శించే జగన్.. ప్రియాంక ఘటనలో మృతురాలి కుటుంబం తరఫున మాట్లాడటం విచిత్రంగా ఉందన్నారు. మహిళల భద్రత విషయంలో గత ఐదేళ్ల పాలనను ప్రజలు మరచిపోలేదని, ఇప్పుడు మొసలి కన్నీరు కార్చడం వల్ల ప్రయోజనం ఉండదని ప్రత్తిపాటి వ్యాఖ్యానించారు.

# నేరపరిశోధనలో డిటెక్టివ్ జీవన్



సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న కామెడీ ఎంటర్‌టైనర్ 'సుధీర్స్ జోకర్'. అయేషా కథానాయిక. పీఎస్ సునీల్ పుప్పాల దర్శకుడు. శ్రీనివాసులు పీవీ, విజయ్ డొంకాడ, శ్రీధర్ మక్కువ నిర్మాతలు. మురళీశర్మ ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారు. మురళీశర్మ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాలో ఆయన పోషిస్తున్న 'డిటెక్టివ్ జీవన్' పాత్రను పరిచయం చేస్తూ ఓ స్పెషల్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. మురళీశర్మ కెరీర్‌లో 'డిటెక్టివ్ జీవన్' మరో గొప్ప పాత్రగా నిలుస్తుందని, హీరో చేస్తున్న క్రైమ్‌ని తన ఇంటెలిజెన్స్, ఎక్స్‌పీరియన్స్‌తో డీకోడ్ చేసేందుకు డిటెక్టివ్ జీవన్ ఎలాంటి ప్రయత్నాలు చేశాడు? అనేది ఇందులో ఆసక్తికరమైన అంశమని మేకర్స్ చెబుతున్నారు. అభిరామి, అజయ్‌ఘోష్, రమేశ్ ఇందిరా, విష్ణు ఓయ్, మురళీధర్‌గౌడ్ ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: అహ్మద్ షరీఫ్, సంగీతం: లియోన్ జేమ్స్.

# 'కపాలి'లో కీలకంగా

నారా రోహిత్ హీరోగా రూపొందుతున్న పోలీస్ నేపథ్య సైకలాజికల్ హారర్ థ్రిల్లర్ 'కపాలి'. హన్సిక మోత్వాని కథానాయిక. రామ్ గన్ని దర్శకుడు. కల్యాణచక్రవర్తి మంథినా, భానుకిరణ్ ప్రతాప నిర్మాతలు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభించిందని మేకర్స్ ఆనందం వెలిబుచ్చుతున్నారు. ఆదివారం కథానాయిక హన్సిక మోత్వానీ పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ.. ఈ సినిమాలోని ఆమె ఫస్ట్‌లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తున్న హన్సికను ఈ పోస్టర్‌లో చూడొచ్చు. ఈ కథలో ఆమె పాత్ర ప్రాధాన్యతను ఈ స్టిల్ తెలియజేస్తున్నది. ఆమె చుట్టూ ఉన్న మిస్టీరియస్ ఎలిమెంట్స్ సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచుతున్నాయి. ఈ చిత్రానికి నిర్మాణం: సప్త అశ్వ మీడియా వర్క్స్



# కాలాన్ని దాటి ప్రపంచాన్ని చుట్టివచ్చే యోధుడు



సినీప్రియులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఎస్ఎస్ రాజమౌళి 'వారణాసి' చిత్రం నుంచి రెండు ప్రత్యేకమైన స్టిల్స్‌ను మహేశ్‌బాబు పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం విడుదల చేసింది. ఈ స్టిల్స్‌లో మహేశ్ 'రుద్ర'గా నేచురల్ లుక్‌లో తొలిసారి ప్రపంచానికి కనిపించారు. పాలసంద్రంలో శేషపాన్పుపై సేదతీరే శ్రీమహావిష్ణువులా దట్టమైన అడవి మధ్యలో ఒక వెదురు తెప్పపై విశ్రాంతి తీసుకుంటున్న రుద్రను ఓ స్టిల్‌లో చూడొచ్చు. అలాగే.. కెన్యాలోని మసాయి మారా మైదానంలో జిరాఫీలు, క్రూరమృగాల మధ్య నిలబడి, వెనక్కి చూస్తున్న రుద్రను మరొక స్టిల్‌లో చూడొచ్చు. రుద్ర పాత్ర తీరుతెన్నుల్ని ఆవిష్కరించేలా ఈ రెండు స్టిల్స్ కనిపిస్తున్నాయి. 'వారణాసి' సినిమా సోల్‌ని కూడా సూచాయగా ఈ స్టిల్స్ చెబుతున్నాయి. కాలాన్ని దాటి ప్రపంచాన్ని చుట్టి వచ్చే ఓ వ్యక్తి ప్రయాణమే ఈ సినిమా అని మేకర్స్ చెబుతున్నారు.దరాజమౌళి ఈ మేరకు తన సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ.. 'అసాధ్యమైన కార్యాన్ని సుసాధ్యం చేసేందుకు జన్మించినవాడు రుద్ర. అతను చమత్కారి. సున్నితమైనవాడు. ఉగ్రరూపం దాల్చగలడు. ఉగ్రంగా కనిపించే పాత్రను ఎవరైనా పోషించగలరు. కానీ ఒకేసారి ఉగ్రంగా, సున్నితంగా అభినయించగలవారు తక్కువమంది ఉంటారు. అందుకే ఈ పాత్రకు మహేశ్‌ని ఎంచుకున్నాను. మా ఆఫ్రికా షెడ్యూల్‌లో తీసిన స్టిల్స్ ఇవి. ఏ సెట్ ఇవ్వలేని అనుభూతిని మాకు ఆ నేల ఇచ్చింది. కిలిమంజారో చుట్టూ మసాయి మారాలో షూటింగ్ చేస్తున్నప్పుడు నేను నిజంగా నివ్వెరపోయాను. ఉదయాన్నే మా కళ్ల ముందు కనిపిస్తున్న అందాన్ని ఐమ్యాక్స్ కెమెరా కూడా క్యాప్చర్ చేయలేదని మాకు అనిపించింది' అంటూ పోస్ట్‌లో రాజమౌళి పేర్కొన్నారు. ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రతినాయక పాత్రను పోషిస్తున్న విషయం తెలిసిందే. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న సినిమా విడుదల కానున్నది. ఈ చిత్రానికి సంగీతం: ఎంఎం కీరవాణి, నిర్మాణం: శ్రీదుర్గా ఆర్ట్స్, షోయింగ్ బిజినెస్.

# రవితేజ 'ఇరుముడి'

## ట్రైలర్ రిలీజ్ పై స్పెషల్ పోస్టర్




మాస్ మహారాజా రవితేజ, విజయవంతమైన దర్శకుడు శివ నిర్వాణ కాంబినేషన్‌లో వస్తున్న కొత్త చిత్రం 'ఇరుముడి'. ఈ సినిమా ట్రైలర్ ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో, ఈ చిత్రబృందం ప్రమోషన్ల స్పీడు పెంచింది. ఈ క్రమంలో, అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఇరుముడి' థియేట్రికల్ ట్రైలర్ ను ఆగస్టు 12న విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో భారీ స్థాయిలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించబోతున్నారు. భీమవరంలోని ఎస్ఆర్కేఆర్ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో ఆ రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఈ కార్యక్రమం జరగనుంది. ఈ మేరకు చిత్ర యూనిట్ ఒక ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. "తన కుటుంబాన్ని కాపాడేందుకు ఓ వ్యక్తి విశ్వాసాన్నే తన అతిపెద్ద ఆయుధంగా మార్చుకుని చేసే ప్రయాణమే ఈ సినిమా" అంటూ విడుదల చేసిన ట్యాగ్‌లైన్, 'ఇరుముడి' అనే టైటిల్ సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి. భక్తి, కుటుంబ భావోద్వేగాల కలబోతగా ఈ సినిమా ఉండబోతున్నట్టు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని ప్రఖ్యాత నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్, టీ-సిరీస్‌తో కలిసి నిర్మిస్తోంది. ఇందులో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సాయికుమార్, బేబీ నక్షత్ర కీలక పాత్రలు పోషిస్తున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమాపై అభిమానుల్లో, సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి.

# అల్లరి నరేష్ కొత్త సినిమా.. 'రంభ ఊర్వశి మేనక' టీజర్ డేట్ ఫిక్స్!


టాలీవుడ్ కామెడీ కింగ్ అల్లరి నరేష్ తన సిగ్నేచర్ కామెడీ జోనర్‌తో మరోసారి ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించడానికి సిద్ధమయ్యారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'రంభ ఊర్వశి మేనక' . ఈ చిత్రం నుంచి మేకర్స్ తాజాగా ఒక క్రేజీ అప్‌డేట్‌ను విడుదల చేశారు. ఈ సినిమా నుంచి ఆగస్టు 11న టీజర్ విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు. టీజర్ డేట్‌లో మాత్రమే చిన్న సర్దుబాటు... ఎంటర్‌టైన్‌మెంట్‌లో మాత్రం ఎలాంటి సర్దుబాట్లు ఉండవు" అంటూ చిత్ర యూనిట్ ఈ సినిమాపై అంచనాలను మరింత పెంచేసింది. ఈ చిత్రానికి సంబంధించిన మోస్ట్ అవేటెడ్ టీజర్ ఆగష్టు 11న గ్రాండ్‌గా లాంచ్ కానుంది. అల్లరి నరేష్ పాత కామెడీ టైమింగ్‌ను గుర్తుచేసేలా ఈ సినిమా ఉండబోతుందని పోస్టర్లు చూస్తేనే అర్థమవుతోంది. ఈ చిత్రంలో అల్లరి నరేష్ సరసన సురభి హీరోయిన్‌గా నటిస్తుండగా, చంద్రమోహన్ దర్శకత్వం వహిస్తున్నారు. హాస్య మూవీస్ మరియు అన్నపూర్ణ స్టూడియోస్ పతాకాలపై రాజేష్ దండా, లెమన్ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అల్లరి నరేష్ మార్క్ ఫుల్-ఆన్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో రాబోతున్న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 4, 2026న ఘనంగా విడుదల కానుంది. థియేటర్లలో నవ్వుల వర్షం కురిపించేందుకు రెడీ అవుతున్న ఈ సినిమా టీజర్ కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




# కిరణ్ అబ్బవరం 'ఇంద్రపుత్ర'..

## పాన్ ఇండియా స్థాయిలో భారీ మైథలాజికల్ చిత్రం

వరుస విజయాలతో మంచి ఫామ్‌లో ఉన్న యువ హీరో కిరణ్ అబ్బవరం తన కెరీర్‌ను మరో స్థాయికి తీసుకెళుతున్నారు. ప్రాంతీయ చిత్రాల పరిధిని దాటి పాన్ ఇండియా స్థాయిలో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. ఆయన కథానాయకుడిగా 'ఇంద్రపుత్ర' అనే భారీ మైథలాజికల్ యాక్షన్ ఫాంటసీ చిత్రాన్ని సోమవారం అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన టైటిల్ పోస్టర్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఇది కిరణ్ కు 15వ చిత్రం.ప్రముఖ నిర్మాణ సంస్థ జీ స్టూడియోస్, గతంలో సుధీర్ బాబుతో 'జటాధార' నిర్మించిన ప్రేరణ అరోరా ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. శ్రీకాంత్ పుప్పాల ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు దర్శకత్వం వహించనున్నారు. ధర్మానికి, అధర్మానికి మధ్య జరిగే యుద్ధం నేపథ్యంలో రాబోయే ఒక సినిమాటిక్ యూనివర్స్‌లో ఇది తొలి భాగంగా ఉంటుందని చిత్రబృందం తెలిపింది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కనున్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ 2026 అక్టోబరులో ప్రారంభం కానుంది. 2027లో పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. కెరీర్ ఆరంభంలో కొన్ని పరాజయాలు, సోషల్ మీడియాలో ట్రోలింగ్ ఎదుర్కొన్న కిరణ్ అబ్బవరం, ఇటీవల కాలంలో బలంగా పుంజుకున్నారు. 'కా', 'కే రాంప్', 'చెన్నై లవ్ స్టోరీ' వంటి చిత్రాలు బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధించి ఆయనకు మంచి మార్కెట్‌ను అందించాయి. ఈ విజయాలతో వచ్చిన ఆత్మవిశ్వాసంతోనే ఆయన ఇప్పుడు పాన్ ఇండియా ప్రాజెక్టులపై దృష్టి సారించారు. ప్రస్తుతం కిరణ్ చేతిలో పలు ఆసక్తికరమైన ప్రాజెక్టులు ఉన్నాయి. తన 13వ చిత్రంగా 'రియాలిటీ' అనే సినిమాను స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నారు. జాయ్ ఫిల్మ్స్ పతాకంపై సుధాకర్ చాగంటి నిర్మిస్తున్న ఈ చిత్రంతో కన్నడ నటి దేవిక భట్ పరిచయమవుతున్నారు. ఈ సినిమాను 2026 డిసెంబరులో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. దీనితో పాటు సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌పై వీర కొగటం దర్శకత్వంలో ఓ క్రైమ్ థ్రిల్లర్‌లో కూడా కిరణ్ నటిస్తున్నారు. వరుస చిత్రాలతో బిజీగా ఉంటూనే, 'ఇంద్రపుత్ర'




# 'అగధ' మూవీ సందడి.. రేపు హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ వేడుక



సీనియర్ నిర్మాత, దర్శకుడు, విలక్షణ చిత్రాల రూపకర్త ఎం.ఎస్. రాజు దర్శకత్వంలో తెరకెక్కిన కొత్త చిత్రం 'అగధ'. మిస్టరీ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ ప్రమోషన్ కార్యక్రమాలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా రేపు హైదరాబాద్‌లోని దసపల్లా హోటల్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఈ వేడుక ప్రారంభం కానుంది. శ్రీ ఆదివరాహ ప్రొడక్షన్స్ పతాకంపై కాశి విశాలాక్షి బాలుసు 'అగధ' చిత్రాన్ని నిర్మించారు. 'న్యూ ఏజ్' చిత్రంగా ప్రచారమవుతున్న ఈ సినిమాలో సాయి కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి, ఉల్కా గణేష్, షిజు ఏఆర్, జోవికా విజయకుమార్ ప్రధాన పాత్రలు పోషించారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై ఆసక్తిని పెంచాయి. తనదైన శైలిలో వైవిధ్యమైన కథలను ఎంచుకునే ఎం.ఎస్. రాజు ఈసారి 'అగధ'తో ప్రేక్షకులకు ఎలాంటి అనుభూతిని పంచుతారోనని అందరూ ఎదురుచూస్తున్నారు.ఈ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు చిత్ర బృందంతో పాటు పలువురు సినీ ప్రముఖులు హాజరుకానున్నట్లు సమాచారం. శ్రీ ఆదివరాహ ప్రొడక్షన్స్ యూట్యూబ్ ఛానెల్‌లో ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# స్వర్ణరథారూఢులైన స్వామిఅమ్మవార్లకు విశేషపూజలు





శ్రీశైలం (ప్రశ్న న్యూస్) ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వర్ణరథారూఢులైన శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషపూజలు అదేవిధంగా ఆ రోజు వేకువజామున శ్రీస్వామిఅమ్మవార్లకు వైదికపరమైన విశేషపూజలు నిర్వహించబడ్డాయి. అనంతరం స్వర్ణరథంపై కొలువై ఉన్న శ్రీస్వామిఅమ్మవార్లకు పూజాదికాలు జరిపించబడుతాయి. ఈ పూజాదికాలకు ముందుగా అర్చకస్వాములు లోకకల్యాణాన్నికాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. కాగా సకాలంలో తగినంత వర్షాలు కురిసి పంటలు బాగా పండి రాష్ట్రం సశ్యశ్యామలంగా ఉండాలనే సంకల్పంతో దేవస్థానం ఈ నెల 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకు వరుణయాగ సహిత సహస్రఘటాభిషేకం విశేషపూజలను నిర్వహిస్తున్నందున ఈ స్వర్ణరథోత్సవ ఊరేగింపు నిలుపుదల చేయడం జరిగింది. ఈ పూజలలో దేవదాయశాఖ అదనపు కమిషనరు ఎస్.ఎస్.చంద్రశేఖర ఆజాద్, ధర్మకర్తల మండలి అధ్యక్షులు ,పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు ఎ.వి. రమణ, బి. రవణమ్మ, చిట్టిబొట్ల భరద్వాజశర్మ, జి. లక్ష్మీశ్వరి, దేవికి వెంకటేశ్వర్లు, మేడా మురళీధర్, యు. సుబ్బలక్ష్మీ, జిల్లెల శ్రీదేవి, ధర్మకర్తల మండలి ప్రత్యేక ఆహ్వానితులు కారుపర్తి నాగమల్లేశ్వరరావు, ఆకుల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకూ పోరు ఆగదు ఎక్స్ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి

**డీఎస్సీ అభ్యర్థులకు మద్దతుగా శ్రీకాళహస్తిలో నిరసన ర్యాలీ**



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) నిరసన ర్యాలీలో భారీగా పాల్గొన్న గెజ్ –జెడ్ యువత స్పోర్ట్స్ కోటా పేరిట అర్హత లేని టీడీపీ కార్యకర్తలకు డీఎస్సీ ఉద్యోగాలు కట్టబెట్టారు అని ధ్వజం డీఎస్సీలో అవినీతిపై సిబిఐ విచారణ చేయాల్సిందే నిరుద్యోగ భృతి పేరిట మోసానికి బాధ్యత వహించాల్సిందే యువతను వంచించిన మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్.?డీఎస్సీ 2025 నియామకాల్లో జరిగిన తీవ్ర అక్రమాలపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి పట్టణంలో నిరసన ర్యాలీ. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,2024 ఎన్నికల్లో గెలిచిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మొదటి సంతకం మెగా డీఎస్సీ అంటూ 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తున్నామని హడావుడి చేశారు.కానీ తీరా చూస్తే, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఆ పోస్టులను అంగట్లో సరుకుల్లా పంచిపెట్టారు.మరి ముఖ్యంగా స్పోర్ట్స్ కోటాలో కనీసం పతకాలు సాధించకపోయినా, ఛాంపియన్స్ పేరుతో టీడీపీ కార్యకర్తలకు ఉద్యోగాలు ఇచ్చారు కనీసం ఇంటర్ కూడా పాస్ అవ్వని వారికి నకిలీ సర్టిఫికేట్లతో స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగాలు కట్టబెట్టడం అత్యంత దారుణం.అర్హత ఉన్నవారికి డీఎస్సీ ఉద్యోగాలు ఇవ్వాలనేదే మా ప్రధాన డిమాండ్ అంతేగానీ ఉన్నవారిని తొలగించాలన్నది మా ఉద్దేశం కాదు.గతంలో మన జగనన్న పాలనలో సచివాలయ వ్యవస్థ ద్వారా ఒక్క చిన్న పొరపాటు కూడా జరగకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా ప్రభుత్వ ఉద్యోగాలు అందించం అన్నారు.

# అమ్మవారి దయతో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలి: విజయేందర్ రెడ్డి

**వెంకట సాయి నగర్ కాలనీలో ఘనంగా బోనాల ఉత్సవాలు**





ఉప్పల్ (ప్రశ్న న్యూస్) రామంతపూర్ బాగాయత్‌లోని వెంకట సాయి నగర్ కాలనీలో బోనాల పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వెంకట సాయి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. అనంతరం అమ్మవారి తొట్టెల ఊరేగింపును కాలనీలోని ప్రధాన వీధుల గుండా నిర్వహించారు. తొట్టెల ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు, డప్పుల మోత, మహిళల బోనాల సందడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ బోనాల పండుగను ప్రతి సంవత్సరం కాలనీ ప్రజలందరూ ఐకమత్యంతో, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కాలనీలో సుఖశాంతులు, ఆరోగ్యం, సౌభాగ్యం వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు విజయేందర్ రెడ్డి ,గౌరవ సభ్యులు రమేష్ గౌడ్, ఎం రవికుమార్ , గోపాల్ యాదవ్ , సర్వ సత్తయ్య యాదవ్, శివ శంకర్ , సంజీవ కమిటీ సభ్యులు ఆర్ గోవింద్, జి అశోక్, శ్రీనివాస్ గౌడ్ , కే నవీన్ కుమార్, భూపతి నరసింహ గౌడ్, డాక్టర్ విద్యాసాగర్, రామకృష్ణ, శివకుమార్ , బి.చలపతిరావు, రమేష్ శెట్టి, శ్రీధర్ గౌడ్, స్వామి, నరేష్, శ్రీనివాస్ రెడ్డి ,హరీష్ , శేఖర్, బి.రాములు గౌడ్, చంద్రం చారి ,పరుశురాం, ఐలేష్ యాదవ్, చారి, హుస్సేన్, బాల కొమరయ్య, తదితరులు పాల్గొన్నారు.

# క్విట్ ఇండియా స్ఫూర్తితో వామపక్షాల జైల్ భరో

**రోడ్డెక్కిన రైతు, కార్మిక, గిరిజన సంఘాలు**

**కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా గంటపాటు రాస్తారోకో - ప్రయాణికులు అవస్థలు**

**ప్రజలను పక్కనపెట్టి కార్పొరేట్లకు కొమ్ము-జాగటి రవితేజ ఆగ్రహం**





ఏటూరునాగారం (ప్రశ్నన్యూస్) కేంద్ర బీజేపీ ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సోమవారం ములుగు జిల్లా ఏటూరునాగారంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వామపక్ష సంఘాల పిలుపు మేరకు జరిగిన జైల్ భరో కార్యక్రమం రోడ్డెక్కి పెద్ద ఎత్తున నిరసనగా మారింది.
క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో సి ఐ టి యు వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, గిరిజన సంఘం, ఎస్ ఎఫ్ ఐ నేతలు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. ఉదయం ఏటూరునాగారం ఎంపీడీవో కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా బయలుదేరిన ఆందోళనకారులు పట్టణ ప్రధాన వీధుల గుండా నినాదాలు చేస్తూ ముందుకు సాగారు.

**యన్ హెచ్-163 స్తంభనతో ప్రయాణికుల అవస్థలు.**

ర్యాలీ వై జంక్షన్ వద్దకు చేరుకోగానే ఉద్రిక్తత పెరిగింది. కార్పొరేట్ విధానాలు వద్దు, కార్మిక హక్కులు కాపాడాలి అంటూ నినాదాలు చేసిన ఆందోళనకారులు ఒక్కసారిగా జాతీయ రహదారి 163పై బైఠాయించారు. దీంతో రహదారిపై వాహనాల రాకపోకలు గంటపాటు పూర్తిగా స్తంభించిపోయాయి. హైదరాబాద్ - భద్రాచలం మార్గంలో ప్రయాణిస్తున్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.
విషయం తెలుసుకున్న ఏటూరునాగారం మహేష్ వెంటనే భారీ పోలీసు బందోబస్తుతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. రహదారిని ఖాళీ చేయాలని పలుమార్లు హెచ్చరించినా ఆందోళనకారులు వెనక్కు తగ్గకపోవడంతో పోలీసులు అరెస్టులు చేపట్టారు. దాదాపు 200 మంది ఆందోళనకారులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

**కార్పొరేట్లకు కొమ్ము కాస్తోంది..**

అరెస్టుకు ముందు ఎస్ ఎఫ్ ఐ నాయకుడు జాగటి రవితేజ మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వంపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. "సామాన్య ప్రజలను పక్కనపెట్టి కార్పొరేట్లకు కొమ్ము కాస్తోంది. రైతులకు గిట్టుబాటు ధర లేదు, కూలీలకు ఉపాధి లేదు. కార్మిక చట్టాలను నీరుగారుస్తున్నారు. క్విట్ ఇండియా స్ఫూర్తితో ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తాం అని ఆయన హెచ్చరించారు.
ఈ నిరసన కార్యక్రమంలో రైతు సంఘం నేత ఎల్పీ ముత్యాలు, సి ఐ టి యూనేత జాగటి చిన్నతో పాటు వివిధ సంఘాలకు చెందిన 200 మంది పాల్గొన్నారు.


**పెద్ద ఎత్తున సంచలనం..**

దేశవ్యాప్తంగా వామపక్ష సంఘాలు ఇచ్చిన జైల్ భరో పిలుపులో భాగంగా జరిగిన ఈ ఆందోళన ఏటూరునాగారంలో పెద్ద ఎత్తున సంచలనం సృష్టించింది. కార్పొరేట్ వ్యతిరేక నినాదాలతో మారుమోగిన పట్టణంలో పోలీసులు మధ్యాహ్నం వరకు పటిష్ట బందోబస్తు కొనసాగించారు.

# మెలూహా నుంచి 'అర్థ సూత్రం'

## – ఏఐ ఆధారిత వ్యక్తిగత సంపద జ్యోతిష్య నివేదిక






బెంగళూరు (ప్రశ్న న్యూస్) బెంగళూరుకు చెందిన ఏఐ ఆధారిత జ్యోతిష్య వేదిక మెలూహా 'అర్థ సూత్రం' పేరుతో వ్యక్తిగత సంపద జ్యోతిష్య నివేదికను ప్రారంభించింది. వేద జ్యోతిష్య పరిజ్ఞానాన్ని కృత్రిమ మేధస్సు (ఏఐ) సాంకేతికతతో అనుసంధానించి, వ్యక్తుల ఆర్థిక సామర్థ్యం, వృత్తి అభివృద్ధి, ఆదాయ అవకాశాలు, సంపదకు సంబంధించిన ధోరణులపై వ్యక్తిగతీకరించిన అవగాహనను అందించడం ఈ నివేదిక లక్ష్యమని సంస్థ తెలిపింది. వ్యక్తి జన్మకుండలి, గ్రహాల ప్రభావాలు, సంపద, ఉద్యోగం, ఆదాయం, ఆర్థిక అవకాశాలకు సంబంధించిన జ్యోతిష్య కలయికలను విశ్లేషించి 'అర్థ సూత్రం' ద్వారా వ్యక్తిగత మార్గదర్శకత్వాన్ని అందిస్తారు. సంపద యోగాలు, అనుకూలమైన ఆర్థిక కాలాలు, వృత్తి మరియు ఆదాయ సామర్థ్యంతో పాటు వ్యక్తిగత పరిహారాలు, సూచనలను కూడా నివేదిక అందిస్తుంది.
సంపదకు సంబంధించిన జ్యోతిష్య మార్గదర్శకత్వంపై వినియోగదారుల్లో ఆసక్తి పెరుగుతోందని మెలూహా తెలిపింది. సంస్థ ప్లాట్‌ఫామ్‌లోని మొత్తం ప్రశ్నల్లో దాదాపు 15 శాతం సంపదకు సంబంధించినవే కాగా, గత 12 నెలల్లో ఇటువంటి ప్రశ్నలు 50 శాతానికి పైగా పెరిగినట్లు పేర్కొంది. సంపదకు సంబంధించిన మార్గదర్శకత్వం కోరుతున్న వారిలో 65 శాతం మంది 25--44 సంవత్సరాల వయస్సు గలవారేనని సంస్థ వెల్లడించింది. సంక్లిష్టమైన జ్యోతిష్య విశ్లేషణలను సులభంగా అర్థం చేసుకునేలా చేయడంలో తమ ఏఐ సాంకేతికత సహాయపడుతుందని మెలూహా పేర్కొంది. సంప్రదాయ జ్యోతిష్యాన్ని భర్తీ చేయడం కాకుండా, వ్యక్తిగతీకరించిన జ్యోతిష్య మార్గదర్శకత్వాన్ని మరింత సులభంగా అందించేందుకు ఏఐని సహాయక సాంకేతికతగా ఉపయోగిస్తున్నామని సంస్థ తెలిపింది. మెలూహా వ్యవస్థాపకుడు, సీఈఓ విక్రమ్ లభే మాట్లాడుతూ, సాంకేతికత సంప్రదాయ వేద జ్యోతిష్య పరిజ్ఞానాన్ని భర్తీ చేయకుండా మరింత విస్తృతంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తమ ఉద్దేశమని తెలిపారు. 'అర్థ సూత్రం' వ్యక్తుల సంపదకు సంబంధించిన బలాలను గుర్తించడం, ఆదాయ అవకాశాలను తెలుసుకోవడం, ఆర్థిక ధోరణులను అర్థం చేసుకోవడంలో సహాయపడే వ్యక్తిగత మార్గదర్శకంగా ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రస్తుతం మెలూహా 190 దేశాల్లో 30 లక్షలకు పైగా వినియోగదారులకు సేవలందిస్తోందని సంస్థ తెలిపింది. సంబంధాలు, కెరీర్, వ్యక్తిగత అభివృద్ధి, సంపద తదితర అంశాల్లో ఏఐ ఆధారిత వ్యక్తిగత మార్గదర్శకత్వాన్ని అందిస్తోంది.

# కేసీఆర్‌ను కలిసిన గజ్వేల్ మాజీ చైర్మన్ రాజమౌళి

**గజ్వేల్‌లో బీఆర్ఎస్ బలోపేతంపై అధినేతతో చర్చ**

**ప్రజా సమస్యలపై పోరాడుతూ పార్టీ శ్రేణులకు అండగా ఉండాలని కేసీఆర్ దిశానిర్దేశం**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్)గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ ఎన్.సి. రాజమౌళి మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఎర్రవల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా గజ్వేల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి జరుగుతున్న కృషి, పార్టీ శ్రేణుల పరిస్థితిపై కేసీఆర్‌కు వివరించారు. గతంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్‌గా సేవలందించే అవకాశం కల్పించడంతో పాటు పట్టణ అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించినందుకు కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.గజ్వేల్ నియోజకవర్గ వ్యాప్తంగా నెలకొన్న ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల బలాబలాలపై అధినేతతో రాజమౌళి చర్చించారు.నియోజకవర్గ ప్రజలతో నిరంతరం మమేకమై ఉండాలని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూ పార్టీ శ్రేణులకు అండగా నిలవాలని కేసీఆర్ దిశానిర్దేశం చేసినట్లు ఎన్.సి. రాజమౌళి తెలిపారు.

# మృతిచెందిన బీఆర్ఎస్ కార్యకర్త తల్లికి పద్మాదేవేందర్‌రెడ్డి నివాళి



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటామని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. రామాయంపేట మండలం కాట్రియాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కొత్త సుధాకర్‌రెడ్డి తల్లి కొత్త శ్యామల ఆదివారం మృతిచెందారు. ఈవిషయం తెలుసుకున్న పద్మాదేవేందర్‌రెడ్డి సోమవారం కాట్రియాల గ్రామంలోని సుధాకర్‌రెడ్డి నివాసానికి వెళ్లి శ్యామల చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారిని ఓదార్చారు. శ్యామల మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. దుఃఖ సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కాట్రియాల ఉపసర్పంచ్ బాబు నాయక్, మాజీ సర్పంచ్ శ్యామ్, శ్యామ్‌రెడ్డి, నాయకులు సాయిరెడ్డి, మైసగౌడ్, బోయిని శ్యామ్, సత్యపాల్, శ్రీకాంత్ సాగర్, బసవయ్య, వార్డు సభ్యుడు మల్లారెడ్డి, గడిల ప్రమోద్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్ఐటి వరంగల్ లో సీటు సాధించిన విద్యార్థినికి చేయూత

**ప్రతిభకు చేయూత ఆర్ ఎన్ ఐ నుంచి 10,000 విద్యా సహాయం**

**గ్రామ విద్యార్థుల అభివృద్ధికి పూజారి కిరణ్ కుమార్ చేయూత**





ఏటూరు నాగారం (ప్రశ్న న్యూస్) మండలం లోని శంకరాజుపల్లి గ్రామానికి చెందిన కుమారి అనుము అఖిల ప్రతిష్టాత్మక నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, వరంగల్ లో ప్రవేశం పొందారు. ఈ సందర్భంగా అమెరికా సంయుక్త రాష్ట్రాలలో నివసిస్తున్న ప్రవాస భారతీయుడు పూజారి కిరణ్ కుమార్ ఆమెకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.గ్రామంలోని ప్రతిభావంతులైన విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడాలనే ఉద్దేశంతో కిరణ్ కుమార్ 10,000 విద్యా ప్రోత్సాహక నిధిని అందజేశారు. ఈ మొత్తాన్ని గ్రామ సర్పంచ్ డి.వి.కె ద్వారా అందజేయించారు.కుమారి అఖిల తన విద్యాభ్యాసంలో మరింత రాణించి, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకొని తల్లిదండ్రులకు, గ్రామానికి, రాష్ట్రానికి గర్వకారణంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.

# బస్టాండ్ ఉంది.. బస్సుల జాడ లేదు

- తాడికొండలో ప్రయాణికుల అవస్థలు,
- సమయాల పట్టిక లేదు. - సమాచారం ఇచ్చే సిబ్బంది లేరు.
- కూర్చునేందుకు కుర్చీలు లేవు. - కాలకృత్యాలకు మరుగుదొడ్లు లేవు.
- నిరాశ్రయులకు షెల్టర్‌గా మారిన ప్రాంగణం.
- గుంటూరుకు ప్రత్యేక బస్సు కోసం ఎదురుచూపులు.

(తోట. వెంకట్ ప్రశ్న న్యూస్ బ్యూరో ఆంధ్ర ప్రదేశ్ )





మండల కేంద్రం అంటే ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, వ్యాపార సముదాయాలు, ప్రజల రాకపోకలతో నిత్యం సందడిగా ఉండాలి. ముఖ్యంగా ప్రజా రవాణాకు కేంద్ర బిందువుగా ఉండే బస్టాండ్‌లో ప్రయాణికులకు కనీస సౌకర్యాలు అందుబాటులో ఉండాలి. కానీ తాడికొండలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. బస్టాండ్ ఉంది.. కానీ ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలు మాత్రం కనిపించవు. బస్సులు ఎప్పుడు వస్తాయో.. ఎప్పుడు వెళ్తాయో తెలిపే సమాచార వ్యవస్థ లేదు. బస్సుల సమయాల పట్టిక ఏర్పాటు చేయలేదు. ప్రయాణికులకు సమాచారం అందించే సిబ్బంది అందుబాటులో ఉండరు. దీంతో గుంటూరు, విజయవాడ తదితర ప్రాంతాలకు వెళ్లే వారు బస్సుల కోసం గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు.

### పేరుకే బస్టాండ్

తాడికొండ మండల కేంద్రంలోని బస్టాండ్ పరిస్థితి ప్రయాణికులను తీవ్ర అసౌకర్యానికి గురిచేస్తోంది. బస్సు కోసం వేచి ఉండే ప్రయాణికులు కూర్చునేందుకు కనీసం కుర్చీలు, బల్లలు కూడా లేవు. మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోంది. బస్సు ఎప్పుడు వస్తుందో తెలియక నిలబడే పరిస్థితి నెలకొంటోంది.ఉదయం పూట గుంటూరు వైపు వెళ్లే ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. సాయంత్రం సమయంలో గుంటూరు నుంచి తాడికొండకు తిరిగి వచ్చే వారి సంఖ్య కూడా గణనీయంగా ఉంటుంది. ఈ సమయాల్లో బస్సుల కోసం వేచి చూసే ప్రయాణికులకు కూర్చునే వసతి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

### టైమింగ్స్ ఏవీ.?

బస్టాండ్‌లో ప్రయాణికులకు అత్యవసరమైనది బస్సుల సమయాల సమాచారం. ఏ బస్సు ఎప్పుడు వస్తుంది? ఏ ప్రాంతానికి వెళుతుంది? గుంటూరుకు వెళ్లే బస్సు సమయం ఎంత? విజయవాడ వైపు వెళ్లే సర్వీసులు ఏవి? వంటి వివరాలు తెలిపే సమాచార బోర్డు ఏర్పాటు చేయాల్సి ఉంది.అయితే తాడికొండ బస్టాండ్‌లో ఇలాంటి సమాచార వ్యవస్థ లేకపోవడంతో ప్రయాణికులు ఇతరులను అడిగి తెలుసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. బస్టాండ్‌లో కంట్రోలర్ తరహాలో ప్రయాణికులకు సమాచారం అందించే సిబ్బంది లేకపోవడం సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది.బస్సు కోసం వచ్చిన ప్రయాణికులు ఒకరిని మరొకరు అడిగి సమయాలు తెలుసుకుంటున్నారు. బస్సు ఆలస్యమైతే ఎంతసేపు వేచి ఉండాలో తెలియక కొందరు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందని ప్రయాణికులు చెబుతున్నారు.

### బస్టాండ్.. షెల్టర్‌గా మారిందా.?

ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన బస్టాండ్ ప్రాంగణం ప్రస్తుతం కొందరు భిక్షాటన చేసేవారికి, నిరాశ్రయులకు ఆశ్రయంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. రాత్రి వేళల్లో కొందరు అక్కడే నిద్రిస్తున్నారని పేర్కొంటున్నారు.ప్రయాణికుల సౌకర్యం, భద్రత కోసం ఉపయోగపడాల్సిన ప్రాంగణంలో ఇలాంటి పరిస్థితులు నెలకొనకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. బస్టాండ్ పరిసరాల్లో నిరంతరం పారిశుద్ధ్య చర్యలు చేపట్టి, ప్రయాణికులకు అనుకూల వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందని అంటున్నారు.

### మరుగుదొడ్లు ఎక్కడ.?

ప్రయాణికులకు అత్యవసరమైన మరుగుదొడ్లు కూడా బస్టాండ్ పరిధిలో అందుబాటులో లేకపోవడం మరో ప్రధాన సమస్యగా మారింది. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బస్సుల కోసం ఎక్కువసేపు వేచి ఉండాల్సి వచ్చినప్పుడు కాలకృత్యాలకు సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారు.బస్టాండ్‌లో మహిళలు, పురుషులకు ప్రత్యేక మరుగుదొడ్లు నిర్మించడంతో పాటు వాటి నిర్వహణకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. తాగునీటి సదుపాయం, పరిశుభ్రమైన వాతావరణం, రాత్రివేళల్లో తగిన విద్యుత్ వెలుగులు కూడా కల్పించాల్సి ఉందని అంటున్నారు.

### గుంటూరు ప్రయాణమే పెద్ద సమస్య

తాడికొండ నుంచి ప్రతిరోజూ గుంటూరుకు పెద్ద సంఖ్యలో ప్రజలు ప్రయాణిస్తుంటారు. ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు, ప్రభుత్వ కార్యాలయాల పనుల కోసం వెళ్లేవారు, వైద్య సేవల కోసం వెళ్లే వారు ఇలా వివిధ అవసరాలతో నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు.మండలంలోని పరిసర గ్రామాల ప్రజలు కూడా తాడికొండ మీదుగా గుంటూరు వైపు ప్రయాణిస్తుంటారు. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. కానీ అందుకు అనుగుణంగా బస్సు సర్వీసులు, సమాచార వ్యవస్థ, వేచి ఉండేందుకు సౌకర్యాలు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### ప్రత్యేక బస్సు కావాలి

తాడికొండ నుంచి గుంటూరుకు ప్రత్యేకంగా అనువైన బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు చాలాకాలంగా కోరుతున్నారు. ఉదయం ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులకు అనుకూలంగా ఉండేలా సర్వీసులు నడిపి.. సాయంత్రం తిరిగి వచ్చే సమయంలో కూడా తగిన బస్సులు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.తాడికొండను కేంద్రంగా చేసుకుని పరిసర ప్రాంతాల నుంచి కూడా ప్రజలు గుంటూరు, విజయవాడ వైపు ప్రయాణిస్తుంటారు. ఈ అవసరాలను పరిగణనలోకి తీసుకుని ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల రద్దీపై అధ్యయనం చేసి కొత్త సర్వీసులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### మండల కేంద్రానికే ఈ దుస్థితా.?

తాడికొండ మండల కేంద్రంగా ఉండి.. ఇంతటి ప్రధాన ప్రాంతంలో ప్రయాణికులకు సరైన బస్టాండ్ సౌకర్యం లేకపోవడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రాజధాని ప్రాంతానికి సమీపంలో ఉన్న తాడికొండకు రోజురోజుకూ రాకపోకలు పెరుగుతున్నాయని, ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆర్టీసీ అధికారులు, సంబంధిత ప్రభుత్వ శాఖలు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

### అధికారుల దృష్టి ఎప్పుడు.?

బస్టాండ్ అభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు అవసరం లేకుండానే ముందుగా కొన్ని ప్రాథమిక సమస్యలను పరిష్కరించవచ్చని ప్రయాణికులు చెబుతున్నారు. బస్సుల టైమింగ్స్ తెలిపే బోర్డు ఏర్పాటు చేయడం, కుర్చీలు వేయడం, తాగునీరు అందించడం, మరుగుదొడ్లు నిర్మించడం, విద్యుత్ వెలుగులు ఏర్పాటు చేయడం వంటి చర్యలు వెంటనే చేపట్టాలని కోరుతున్నారు.అదే సమయంలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా గుంటూరు, విజయవాడ మార్గాల్లో బస్సు సర్వీసులను పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రత్యేకంగా ఉదయం, సాయంత్రం వేళల్లో అదనపు సర్వీసులు నడిపితే ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొంటున్నారు.

### ఇప్పటికైనా మారుతుందా.?

ప్రజా రవాణా వ్యవస్థలో బస్టాండ్ కీలకమైన భాగం. ప్రయాణికులు బస్సు కోసం వేచి ఉండే ప్రదేశంలో కనీస వసతులు లేకపోతే ఇబ్బంది పడేది సామాన్య ప్రజలే. తాడికొండ బస్టాండ్ పరిస్థితిని సంబంధిత అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.బస్టాండ్‌లో సమయాల సమాచార బోర్డు, కూర్చునే వసతి, తాగునీరు, మరుగుదొడ్లు, ర

విద్యుత్ వెలుగులు, పారిశుద్ధ్య నిర్వహణ వంటి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడంతో పాటు ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా బస్సు సర్వీసులను పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.మండల కేంద్రం.. రాజధాని ప్రాంతానికి సమీపం.. నిత్యం వేలాది రాకపోకలు.. అయినా ప్రయాణికులకు మాత్రం కనీస సౌకర్యాలు కరవు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తాడికొండ బస్టాండ్‌కు పునర్వైభవం తీసుకువస్తారా? ప్రత్యేక బస్సు సర్వీసులతో ప్రజల ప్రయాణ కష్టాలకు తెరదించుతారా? అన్నది వేచి చూడాలి.

# మధ్యప్రదేశ్‌లో విషాదం, వాగులో కొట్టుకుపోయిన వ్యాన్

- 9 మంది జలసమాధి



రాజ్‌గఢ్ (ప్రశ్న న్యూస్) మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్ జిల్లాలో సోమవారం ఘోర విషాదం చోటుచేసుకుంది. ప్రయాణికులతో వెళ్తున్న ఓ వ్యాన్ ఉద్ధృతంగా ప్రవహిస్తున్న వాగులో కొట్టుకుపోవడంతో ముగ్గురు చిన్నారులు, ఇద్దరు మహిళలు సహా తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు సురక్షితంగా ఈది ఒడ్డుకు చేరుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, దేవస్ జిల్లా ధన్‌సద్ గ్రామానికి చెందిన 11 మంది ప్రయాణికులు ఓ వ్యాన్‌లో కడ్లవాడ్‌కు వెళుతున్నారు. పచోర్-సారంగ్‌పూర్ రహదారిపై పాడ్నా సమీపంలో ఉదయం 9:30 గంటల సమయంలో ఝిరి వాగు వద్దకు చేరుకున్నారు. భారీ వర్షాలకు వాగు ఉప్పొంగి రోడ్డుపై నుంచి ప్రవహిస్తోంది. వాగు దాటవద్దని స్థానిక గ్రామస్థులు, అధికారులు హెచ్చరించినా డ్రైవర్ వినిపించుకోలేదు. వ్యాన్‌ను ముందుకు నడపడంతో బలమైన నీటి ప్రవాహానికి అది కొట్టుకుపోయి క్షణాల్లో మునిగిపోయింది. సమాచారం అందుకున్న రాష్ట్ర విపత్తు స్పందన దళం ఘటనా స్థలానికి చేరుకుని క్రేన్ సహాయంతో వ్యాన్‌ను బయటకు తీసింది. ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ ముఖేష్ సింగ్, మరో ప్రయాణికుడు హుకుమ్ సింగ్ ప్రాణాలతో బయటపడగా, వారిని ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన చోట వంతెన నిర్మాణంలో ఉందని, దానిపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండటంతోనే ఈ దుర్ఘటన జరిగిందని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 4 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు పలుచోట్ల నదులు, వాగులు పొంగిపొర్లుతున్నాయి.

# శుద్ధ మొక్కపై రాహుల్ మీనా



తూర్పుగోదావరి (ప్రశ్న న్యూస్)తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం తీపర్రు గ్రామానికి చెందిన కోడూరి నాగ సూర్య రాఘవేంద్ర బాబు శుద్ధ మొక్కపై కోనసీమ జిల్లా ఎస్పి సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ ఆయన పేరు, కోనసీమ పోలీస్ చెక్కి అందించారు. ఈ మేరకు ఎస్పీ ఎంతో సంతోషించి రాఘవేంద్ర బాబు తో ముచ్చటించారు, అలాగే అభినందనలు తెలిపారు రాఘవేంద్ర బాబు మాట్లాడుతూ ఎస్పీ సేవలకు గాను ఇలా శుద్ధ ముక్క పై నేను చెక్కడం జరిగింది అని చెప్పారు.

# కాంట్రాక్టర్లకు బిల్లులు రాకుంటే ఇబ్బందులు కావా.?

- పనులు చేయించుకోవడంలో వేగం.. బిల్లులు చెల్లించడంలో జాప్యం
- కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు
- కాంట్రాక్టర్ల గోడు కమిషనర్ కు వినిపిస్తే లేదా.?
- అభివృద్ధి పనులు పూర్తి చేసినా బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ ? తిరగాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన
- అప్పులు చేసి పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లుల కోసం ఎదురుచూపులేనా.?
- చెల్లింపులు ఆలస్యం కావడంతో వడ్డీల భారం పెరుగుతోందని కాంట్రాక్టర్ల ఆందోళన
- బిల్లులు నిలిపివేతతో అభివృద్ధి పనులకు బ్రేక్ పడే ప్రమాదం
- కాంట్రాక్టర్ల ఆర్థిక ఇబ్బందులపై ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డి స్పందించాలనే డిమాండ్లు
-"పనులు చేయించుకుంటారు.. బిల్లులు మాత్రం ఇవ్వరు" ఇదేనా పాలన.?
-పెండింగ్ బిల్లులను వెంటనే పరిష్కరించి కాంట్రాక్టర్లకు న్యాయం చేయాలని డిమాండ్.





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్న కాంట్రాక్టర్ల పరిస్థితి దయనీయంగా మారుతోందని యం యం సి వైస్ ప్రెసిడెంట్ సంగిశెట్టి రవీందర్ సాగర్ అంటున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు పూర్తి చేసి అధికారులకు అప్పగించినప్పటికీ సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన మీడియాకు తెలిపారు. ముఖ్యంగా ఎంఎంసీ పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతోందని ఎంఎంసీ వైస్ ప్రెసిడెంట్, కాంట్రాక్టర్ సంగిశెట్టి రవీంద్ర సాగర్ అన్నారు.

### పనులు మాత్రం వెంటనే కావాలి.. బిల్లులు మాత్రం ఎప్పుడు.?

రోడ్లు, డ్రైనేజీలు, పారిశుద్ధ్యం, మౌలిక వసతులు తదితర అభివృద్ధి పనులను కాంట్రాక్టర్లతో వేగంగా చేయిస్తున్న అధికారులు.. పనులు పూర్తయిన తర్వాత బిల్లుల చెల్లింపులో మాత్రం అదే వేగం చూపడం లేదని రవీంద్ర సాగర్ ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లు తమ సొంత పెట్టుబడులు పెట్టి, అప్పులు తీసుకుని, కార్మికులకు జీతాలు చెల్లించి పనులు పూర్తి చేస్తున్నారని, అయితే బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉంటే వడ్డీలు, ఆర్థిక భారాన్ని ఎవరు భరించాలంటూ ప్రశ్నించారు.
"ప్రభుత్వం తరఫున అభివృద్ధి పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు వస్తున్నారు. పనులు పూర్తయిన వెంటనే బిల్లులు వస్తాయనే నమ్మకంతో బ్యాంకు రుణాలు, వ్యక్తిగత అప్పులు తీసుకుని పనులు చేస్తున్నారు. కానీ పనులు పూర్తయిన తర్వాత బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వస్తే కాంట్రాక్టర్లు ఎలా బతకాలి?" అని ఆయన ప్రశ్నించారు.

### బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలా.?

కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడంలో జాప్యం జరుగుతోందనే ఆరోపణలపై ఎంఎంసీ కమిషనర్ తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బిల్లుల చెల్లింపు ప్రక్రియలో స్పష్టత లేకపోవడం, ఫైళ్లు ఎక్కడ ఉన్నాయో తెలియకపోవడం, అధికారులను కలిసినా సరైన సమాధానం లభించకపోవడం వంటి సమస్యలను కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్నారని రవీంద్ర సాగర్ పేర్కొన్నారు. అభివృద్ధి పనుల కోసం కాంట్రాక్టర్లను పిలిచి పనులు చేయించుకోవడం మాత్రమే కాకుండా, పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లులను కూడా నిబంధనల ప్రకారం సకాలంలో చెల్లించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. బిల్లులు ఆలస్యమైతే కాంట్రాక్టర్లు తీసుకున్న రుణాలపై వడ్డీలు పెరుగుతాయని, మెటీరియల్ సరఫరాదారులకు చెల్లింపులు నిలిచిపోతాయని, కార్మికులకు వేతనాలు ఇవ్వడం కూడా కష్టమవుతుందని వివరించారు.

### కాంట్రాక్టర్ల జీవితాలతో చెలగాటమా.?

అభివృద్ధి పనులు చేయడం కాంట్రాక్టర్ల బాధ్యత అయితే, చేసిన పనులకు బిల్లులు చెల్లించడం అధికారుల బాధ్యత ఆయన అన్నారు. బిల్లులు ఇవ్వకుండా కాంట్రాక్టర్లను ఇబ్బందులకు గురిచేస్తే వారు భవిష్యత్తులో ప్రభుత్వ పనులు చేపట్టేందుకు ఎలా ముందుకు వస్తారు?" అని రవీంద్ర సాగర్ నిలదీశారు.కాంట్రాక్టర్ల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని అధికారులు వ్యవహరించాలని ఆయన కోరారు. బిల్లుల చెల్లింపులో జాప్యం కారణంగా చిన్న కాంట్రాక్టర్లు తీవ్రంగా నష్టపోతున్నారని, పెద్ద సంస్థలకు ఆర్థిక వనరులు ఉండవచ్చని, కానీ చిన్న కాంట్రాక్టర్లు మాత్రం అప్పులు చేసి పనులు నిర్వహిస్తున్నారని తెలిపారు.

### పనులు ఆగితే బాధ్యత ఎవరిది.?

కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించకపోతే భవిష్యత్తులో అభివృద్ధి పనులపై ప్రభావం పడే అవకాశం ఉందని రవీంద్ర సాగర్ హెచ్చరించారు. బిల్లుల చెల్లింపులో జాప్యం కొనసాగితే కాంట్రాక్టర్లు కొత్త పనులు చేపట్టేందుకు వెనుకడుగు వేసే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు.ప్రజలకు అవసరమైన రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక వసతుల పనులు కాంట్రాక్టర్ల ద్వారానే జరుగుతున్నాయని, కాంట్రాక్టర్లను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేయడం వల్ల చివరకు నష్టపోయేది ప్రజలేనని పేర్కొన్నారు.

### కమిషనర్ సమాధానం చెప్పాలంటున్న కాంట్రాక్టర్లు

కాంట్రాక్టర్లకు సంబంధించిన పెండింగ్ బిల్లుల వివరాలను బహిర్గతం చేయాలని, ఏ పనులకు ఎంత మొత్తం బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి, వాటి చెల్లింపులో ఎందుకు జాప్యం జరుగుతోంది అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.బిల్లులు చెల్లించడంలో ఏవైనా సాంకేతిక, పరిపాలనా లేదా నిధుల సమస్యలు ఉంటే వాటిని కాంట్రాక్టర్లకు స్పష్టంగా తెలియజేయాలని, సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.
"కాంట్రాక్టర్లు ప్రభుత్వానికి వ్యతిరేకులు కాదు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములం. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో పనులు చేస్తున్నాం. కానీ చేసిన పనులకు బిల్లులు రాకపోతే మాపై ఆర్థిక భారం పడుతోంది. అధికారులు మా సమస్యను అర్థం చేసుకోవాలి" అని సంగిశెట్టి రవీంద్ర సాగర్ పేర్కొన్నారు.

### ప్రభుత్వం జోక్యం చేసుకోవాలంటూ డిమాండ్

ఎంఎంసీ పరిధిలో కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులపై ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించాలని, వాస్తవంగా పనులు పూర్తయి, నిబంధనల ప్రకారం చెల్లించాల్సిన బిల్లులను వెంటనే విడుదల చేయాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.బిల్లుల చెల్లింపులో ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహారం జరిగితే దానిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, అదే సమయంలో నిబంధనల ప్రకారం చెల్లించాల్సిన బిల్లులను మాత్రం ఆలస్యం చేయకుండా విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు.కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా నెలల తరబడి వేచి పెట్టడం వల్ల అభివృద్ధి పనుల నాణ్యత, వేగం, భవిష్యత్ టెండర్లపై ప్రభావం పడే ప్రమాదం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588